
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025



నేటి అలంకారం అన్నపూర్ణాదేవి



● గాయత్రీదేవిగా అమ్మవారు



వేదమయి..

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

రెండోరోజు ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి రాక ● నిమిషానికి 60 మందికి దర్శనం





అమ్మవారికి నైవేద్యం తీసుకెళ్తున్న అర్చకులు





దుర్గమ్మ నగరోత్సవం



ఉదయం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఇంద్రకీలాద్రి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మంగళవారం గాయత్రీదేవి అలంకారం కావడంతో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. వేదమాత, పంచముఖిగా వర్ధిల్లుతున్న అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. నగరోత్సవం, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అంతటా ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి.

అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులతో కలిసి వెళ్తున్న కలెక్టర్ లక్ష్మీశ దంపతులు



నృత్య అభినయం ప్రదర్శిస్తున్న చిన్నారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇంద్రకీలాద్రి): శ్రీగాయత్రీదేవి అలంకారంలో కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచి రద్దీ కొనసాగింది. మహిళా మంత్రులు వంగలపూడి అనిత, సవిత, గుమ్మడి సంధ్యారాణి తోపాటు మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి తదితరులు ఎరుపు రంగు దుస్తులు ధరించి అమ్మవారిని దర్శించు కున్నారు. క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని ఉదయం వేళ దర్శనం చేసుకో వటానికి 1.20 గంటల సమయం పట్టింది. అదే మధ్యాహ్నం సమయంలో 1.10 గంటలు, సాయంత్రం 1.31 గంటల సమయం పట్టింది. అనధికార దర్శనాలను నియంత్రించగలిగితే గంటలోపే అమ్మవారి దర్శనం భక్తులకు లభిస్తుంది. అమ్మవారిని మిగతా 6లో..

రేలారేలారే.. 8

● ఉత్సాహంగా కొనసాగుతున్న విజయవాడ ఉత్సవ్

కొండంత భక్తి

ఇంద్రకీలాద్రిపై అడుగడుగునా

నిఘా! 6

అడ్మిషన్లపై అనాసక్తి!

కృష్ణా వర్సిటీలోని పీజీ కోర్సులపై ఆసక్తిచూపని విద్యార్థులు

- కామర్స్ కోర్సులో 33 సీట్లకు ఒక్కరే చేరిక
- ఇంగ్లీషు, ఫిజిక్స్, మ్యాథ్స్ విభాగాల్లోనూ ఇద్దరు, ముగ్గురు, నలుగురే..
- మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం
- రెండేళ్ల తర్వాత నేడు అకడమిక్ సెనెట్ సమావేశం
- 12 ఏళ్లుగా మారని సెనెట్ సభ్యులు
- సమావేశంలో చర్చించే అంశాలపై సర్వత్రా ఆసక్తి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో వివిధ పీజీ కోర్సుల అడ్మిషన్ల కోసం ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీ వరకు గడువు పెట్టింది. 18న దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలన, 19న ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్, దివ్యాంగుల కోటా సర్టిఫికెట్ల పరిశీలన, వివిధ కోర్సులలో చేరేందుకు వెబ్‌ఆప్షన్‌లు పెట్టుకునేందుకు అవకాశం ఇచ్చింది. 22న సీట్ల కేటాయింపు, 23 నుంచి 25లోపు వివిధ కోర్సులలో చేరిన విద్యార్థులు రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కాగా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ మంగళవారం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులలో బుధవారం లోపు వివిధ కోర్సులలో చేరని వారి అడ్మిషన్‌లను రద్దు చేయాలని స్పష్టం చేశారు.



కృష్ణా యూనివర్సిటీ

చేరింది వీరే..

వర్సిటీలోని కామర్స్ విభాగంలో 33 సీట్లు ఉండగా ఒక్కరు మాత్రమే చేరారు. ఇంగ్లీష్ విభాగంలో 33 సీట్లకు ఇద్దరు, ఫిజిక్స్ విభాగంలో 33 సీట్లకు ముగ్గురు, మ్యాథ్స్ విభాగంలో 33 సీట్లకు నలుగురు మాత్రమే చేరారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో 40 సీట్లకు 37 మంది, అనలాటికల్ కెమిస్ట్రీ విభాగంలో 40 సీట్లకు 36 మంది, జువాలజీ మిగతా 6లో..

కృష్ణా యూనివర్సిటీలో ఈ ఏడాది వివిధ పీజీ కోర్సుల్లో ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరలేదు. నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నామని వర్సిటీ అధికారులు ప్రచారం చేసినా అడ్మిషన్‌లు పెరగలేదు. మంగళవారం నుంచి పలు కోర్సుల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంగ్లీష్, మ్యాథ్స్, కామర్స్ కోర్సుల్లో ఇద్దరు, ముగ్గురు మాత్రమే చేరారు. దీంతో ఈ తరగతులను నిర్వహిస్తారా లేక రద్దు చేస్తారా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలోనే వర్సిటీ అకడమిక్ సెనెట్ సమావేశం రెండేళ్ల తర్వాత బుధవారం జరగనుంది. ఈ సమావేశంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారనే అంశంపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

పనులకు బ్రేక్!

జల్ జీవన్ మిషన్ పనులు పూర్తిగా ఆపేసిన కాంట్రాక్టర్లు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో చిన్న కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయి రూ.35 కోట్లు
- ఇటీవలే నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ
- బడ్జెట్ రిలీజ్ ఆర్డర్, పే అండ్ అకౌంట్స్ క్లియరెన్స్ పూర్తి
- అయినా ఆర్థిక శాఖ నుంచి విడుదల కాని నగదు
- 26న డిప్యూటీ సీఎం ఆఫీసు ముందు ధర్నాకు కాంట్రాక్టర్ల సన్నద్ధం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను కాంట్రాక్టర్లు నిలుపుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినా.. ఆర్థిక శాఖ నుంచి నగదు విడుదల చేయకపోవటాన్ని నిరసిస్తూ పూర్తిగా ఆపేశారు. ఈ నెల 4వ తేదీన ప్రభుత్వం రూ.152 కోట్ల నిధులను కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఈ నిధులు చెల్లింపునకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్ఓ) కూడా ఇచ్చింది. దీని తర్వాత పే అండ్ అకౌంట్స్ విభాగం నుంచి కూడా చెల్లింపులకు క్లియరెన్స్ వచ్చింది. ఆర్థికశాఖ నుంచి మాత్రం ఎంతకీ నిధులు విడుదల కావటం లేదు. దీంతో కాంట్రాక్టర్లలో తీవ్ర అసహనం నెలకొంది. ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం నేతల దృష్టికి తమ సమస్యలను తీసుకు వెళ్లి ఒత్తిడి తెచ్చారు. దీంతో కాంట్రాక్టర్ల సంఘం అగ్రనేతలు ఇటీవల ఆర్థిక శాఖ కార్యదర్శిని కలిశారు. ఆ సందర్భంలో వారికి సంతృప్తికర సమాధానం రాలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు జేజేఎం పనులను నిలుపుదల చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తంగా రూ.35 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. పెద్ద కాంట్రాక్టర్లు, కార్పొరేట్ కాంట్రాక్టర్లకు ఇంతకు ముందే డబ్బులు మిగతా 6లో..

కొండంత భక్తి..



రెండోరోజు ఆదాయం రూ.25.48లక్షలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి దసరా మహోత్సవాలలో రెండవరోజు సాయంత్రం వరకు దేవస్థానానికి వివిధ రూపాల్లో మొత్తం రూ.25,48,725లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్ల ద్వారా రూ.8,99,400లు, రూ.100ల ద్వారా రూ.3,16,200లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.1,86,930లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.9,66,700లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.69వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్ల ద్వారా రూ.30వేలు, పరోక్ష ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన (టిక్కెట్ రూ.3వేలు) టిక్కెట్ల ద్వారా రూ.9వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.20,464లు, పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,585లు, తలనీలాల సమర్పణకు (టిక్కెట్ రూ.40) టిక్కెట్ల ద్వారా రూ.36,480లు, ఇతరత్రా ఆదాయం రూ.8,966లు మొత్తం కలిపి రూ.25,48,725లు లభించినట్లు ఈవో వివరించారు. సాయంత్రం వరకు భక్తులు 60,641 మంది అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో ప్రకటనలో తెలిపారు.


అమ్మవారిని దర్శించుకున్న మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

దుర్గమ్మ సేవలో ప్రజా ప్రతినిధులు..

చిట్టినగర్ : ఒకరు హోంమంత్రి. మరొకరు బీసీ సంక్షేమ మంత్రి. ఇంకొకరు ఎమ్మెల్యే. ఇంద్రకీలాద్రిపై మంగళవారం మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు అమ్మవారిని దర్శించుకోవడానికి ఏక రూపు దుస్తులతో వచ్చారు. హోంమంత్రి అనిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గాయత్రీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. వారితోపాటు కొవ్వూరు ఎమ్మెల్యే వేంరెడ్డి ప్రశాంతి రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, సింగనమల ఎమ్మెల్యే బండారి శ్రావణి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే జి.మాధవి, తెలంగాణ రాష్ట్రం, మెదక్ ఎంపీ రఘునందన్ రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలంతా అమ్మవారికి ఇష్టమైన ఎరుపురంగు దుస్తులు ధరించడం విశేషం. మన సంస్కృతి సంప్రదాయాలపై సందేశం ఇచ్చేందుకే డ్రెస్ కోడ్ పాటిస్తున్నామని, రాష్ట్రాన్ని చల్లగా చూడాలని దుర్గమ్మను వేడుకున్నామన్నారు.



క్యూలో కలెక్టర్ దంపతులు..



ఇంద్రకీలాద్రి : మంగళవారం గాయత్రీ దేవి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, గ్యానేశ్వరి దంపతులు క్యూలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలో భక్తులను ఉత్సవాల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

దుర్గమ్మ సన్నిధిలో దుర్గగుడి చైర్మన్



గాయత్రీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మను దుర్గగుడి చైర్మన్‌గా నియమితులైన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోడానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మను ప్రముఖులు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఏఐ టెక్నాలజీ సహాయంతో అధికారులు కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.





ప్రతి కదలికపైనా.. నిఘా!

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి చుట్టూ అధికారులు డేగ కన్నేసి ఉంచారు. గుడివైపు కదిలే ప్రతి అడుగు, ప్రతి వాహనంపై అత్యంత నిఘా పెట్టారు. ఘాట్ల నుంచి భక్తులు దర్శనానికి వెళ్లి వచ్చే వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. టోల్‌గేట్లు, పార్కింగ్ స్థలాలు, వాహనాల వివరాలు, ఇలా క్షణాల్లో సమాచారం.. సేకరిస్తున్నారు. అన్న ప్రసాదం స్వీకరించేది ఎందరు.. లడ్డూ ప్రసాదాల వద్ద ప్రతి అంశాన్ని సెకన్లలో తెలుసుకుంటున్నారు. నగరానికి వచ్చిపోయే రైళ్లు.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల విషయంలో అధికారులు పక్కా ప్రణాళికతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే విషయాలన్నీ సెకన్ల వ్యవధిలో అధికారుల చేతుల్లో లెక్కలు ఉంటున్నాయి. ఈసారి దసరా వేడుకల్లో అధికారులు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఎప్పటికప్పుడు పక్కాగా లెక్కిస్తున్నారు.

మోడల్ కంట్రోల్‌రూం

కీలాద్రికి వచ్చే దారులన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయి. ఫుటేజీలను వీక్షించడానికి వీలుగా స్క్రీన్లను దుర్గాఘాట్‌ను ఆనుకుని ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. వినాయకస్వామి గుడి, బస్టాండ్, సీతమ్మపాదాల ఘాట్ నుంచి వచ్చే అన్నిదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. అదే విధంగా పున్నమిఘాట్ సహా కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే రహదారిలోను సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, భక్తులకు ఇబ్బందులు కలిగినా క్షణాల్లో స్పందించేలా మానటరింగ్ చేస్తున్నారు.

క్షణాల్లో సమాచారం..

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300, ప్రోటోకాల్ టిక్కెట్లు తీసుకుని ఎంతమంది భక్తులు వస్తున్నారు. ఎంతమంది దర్శించుకుంటున్నారు వివరాలు క్షణాల్లో కనిపించే విధంగా అధికారులు స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తుల్లో ఎంతమంది అన్నప్రసాదం తీసుకుంటున్నారు. లడ్డూలు ఎంతమంది తీసుకుంటున్నారనే వివరాలు పక్కాగా లెక్కిస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో నిమిషానికి ఎన్నివాహనాలు పార్కింగ్‌కు వస్తున్నాయి, ఎన్ని వెళుతున్నాయి, ప్రస్తుతం ఎన్ని పార్కింగ్‌లో ఉన్నాయనే వివరాలుసేకరిస్తున్నారు. దీనితో పాటు నో పార్కింగ్ జోన్లలో పెట్టిన వాహనాలను క్షణాల వ్యవధిలో టోయింగ్ వాహనం వచ్చి తీసుకెళ్లి దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మోడల్ గెస్ట్ హౌస్‌లో రైల్వే సమాచార స్క్రీన్‌ను ఏర్పాటుచేసి సిబ్బంది మైక్‌ల ద్వారా సమాచారమిస్తున్నారు.

కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సీతమ్మవారి పాదాల వద్ద సిబ్బంది నిర్లక్ష్యం

సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద స్నానాలు చేయడానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఘాట్‌లో నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన జల్లు స్నానాల ట్యాబ్‌ల్లో సిబ్బంది రెండు మాత్రమే వదిలారు. మిగతా రెండింటి ద్వారా నీటిని వదలలేదు. వాటిద్వారా నీటిని వదలాలని అడిగినా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రెండుచోట్ల భక్తుల తాకిడి ఎక్కువై స్నానాలు చేయడానికి భక్తులు ఇబ్బంది పడ్డారు.

వాహనదారులకు అడ్డుకట్ట

ఎన్‌హెచ్ 65, బస్టాప్ వైపుగా వచ్చే వాహనదారులను కనకదుర్గ ఫ్లైఓవర్ మీదగా మళ్లించారు. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. ఎంత ప్రయత్నించినా పోలీసులు విడిచిపెట్టకపోవడంతో వెనుదిరిగి ఏలూరు రోడ్డు- వినాయకస్వామి గుడి వైపు వెళ్లే ఫ్లైఓవర్ మీదగా వెళుతున్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాల తొలగింపు..

భక్తులు వాడిపడేసిన కవర్లు, వాటర్‌బాటిళ్లు, ఇతర వ్యర్థపదార్థాల కోసం వీఎంసీ ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేసింది. కొంత మంది భక్తుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. దీనితో పాటు ఘాట్‌లలో స్నానాలుచేసే కొంతమంది భక్తులు వస్త్రాలు వదిలేస్తున్నారు. వీటిని పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఏరివేస్తూ రోడ్లు, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

ప్రత్యక్ష పూజలకే భక్తుల మొగ్గు

» పరోక్ష పూజలపై విముఖత!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇంద్రకీలాద్రి) : కనకదుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. దసరా ఉత్సవాలలోనూ ఇది కొనసాగుతుంటుంది. ఈ ఉత్సవాలలో సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక పూజల సంఖ్య తగ్గించి.. పరోక్షంగా పూజలు వీక్షించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టినా భక్తులు ప్రత్యక్ష పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. రోజుకు 200 మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటుండగా.. పరోక్షంగా కేవలం 30 మంది వరకే పాల్గొంటున్నారు. దసరా ఉత్సవాలలో మహామండపంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, శ్రీచక్ర నవార్చన, ఖడ్గమాల, చండీహోమం వంటి పూజలు ప్రత్యేకంగా జరుగుతున్నాయి. రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు టిక్కెట్ల ధరలు ఉండే ఈ ప్రత్యేక పూజలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. సామాన్య భక్తుల కోసం కొండ మీద రద్దీ తగ్గించేందుకు ఈ దసరా ఉత్సవాలలో పరిమిత సంఖ్యలో రెండు షిఫ్టుల్లో 200 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులోనే చండీహోమం పూజకు 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. పరోక్ష విధానంలో పూజల్లో పాల్గొనేవారికి లైవ్ లింక్‌ను పంపిస్తారు. దానిని వీక్షిస్తు పూజ ముగిశాక.. అమ్మవారి ప్రసాదాలు, వస్త్రం, రాగి డాలర్ తదితరాలను వారి ఇంటికి పంపిస్తారు. కానీ, పరోక్ష పూజలో ఆశించినంతగా భక్తులు పాల్గొనలేదు. ప్రత్యక్ష పూజలు మాదిరిగా పరోక్ష పూజలను అనుభూతి చెందలేకపోతున్నామన్నది భక్తుల అభిప్రాయంగా ఉంది.

» ప్రత్యేక పూజలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు


భక్తులను అడ్డుకుంటున్న పోలీసులు

అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొనటానికి వచ్చే భక్తులకు కొండపైన ఇబ్బందులు తప్పడంలేదు. ప్రత్యేక పూజకు సమయానికి వారు రావాల్సి ఉంటుంది. ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్న భక్తులు ఓం టర్నింగ్ వద్ద ఇబ్బందులు పడుతున్నారు. వారిని అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకుంటున్నారు. వీళ్ళంతా క్యూలైన్లలో వెళ్ళేవారు కాదు. మహామండపానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక పూజలలో పాల్గొనే వారు తమ టిక్కెట్లను చూపిస్తే ఘాట్ మార్గం నుంచి లోపలికి వారిని పంపించాలి. పోలీసులు అలా చేయటం లేదు. చాలా మంది కొత్త భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొనటానికి టిక్కెట్లను బుక్ చేసుకుంటారు. వీరికి కనీసం సమాచారం తెలపాల్సింది పోయి వారిని క్యూలైన్లలోకి పంపడంతో సమయానికి వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనిని చక్కదిద్దాల్సిన అవసరం ఉంది.


దివ్యాంగులకు ఏర్పాటు చేసిన బస్సులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈవో

వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత బస్సు సదుపాయం

ఇంద్రకీలాద్రి : దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చే వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. దుర్గాఘాట్, రైల్వేస్టేషన్, సిటీ బస్సు టెర్మినల్ వరకు ఈ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ బస్సుల్లో 15 మందికి మాత్రమే అవకాశముంది. వృద్ధులు, దివ్యాంగులవెంట వచ్చిన వారు కూడా బస్సులో ఎక్కుతున్నారు. దీనిని నియంత్రణ చేయాల్సి ఉంది. మంగళవారం క్షేత్రస్థాయిలో ఈవో శీనానాయక్ ఆయా ప్రాంతాల్లో తనిఖీ చేసి తగు సూచనలు చేశారు.

అదనంగా రెండు లడ్డూ ప్రసాదం కౌంటర్లు



పాయకాపురం : ఇంద్రకీలాద్రిపై ఉత్సవాల్లో భాగంగా అధికారులు మరో రెండు లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గా నగర్ వద్ద 11 లడ్డూ ప్రసాదాల కౌంటర్లతో పాటు వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసిన విషయం విధితమే. అయితే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు మంగళవారం కనకదుర్గానగర్‌లో అదనంగా మరో రెండు లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు.

నిరంతర పర్యవేక్షణలో కలెక్టర్, సీపీ

కలెక్టరేట్ : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో సామాన్య భక్తులకే ప్రాధాన్యమిచ్చేలా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, కలెక్టర్ లక్ష్మీశ అన్ని శాఖలను సమన్వయం చేసుకొని నిరంతరం కమాండ్ కంట్రోల్, సీసీ కెమేరాల ద్వారా భక్తుల రద్దీ, సిబ్బంది పనితీరును గమనిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ చేయూత



చిట్టినగర్ : దుర్గమ్మ దర్శనానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు పోలీసు సేవాదళ్ సేవలందిస్తున్నాయి. పదిమంది సభ్యుల బృందాలు వేకువజాము నుంచి రాత్రి వరకు వారికి చేయూతనిస్తూ భక్తుల ప్రశంసలు పొందుతున్నాయి. మంగళవారం అమ్మవారిని సేవించుకోవడానికి సత్తుపల్లి నుంచి ఎం.రజని అనే దివ్యాంగురాలు భర్త కృష్ణయ్యతో కలిసి వచ్చారు. ప్రత్యేక బస్సులో ఇంద్రకీలాద్రికి చేరుకోగా, అక్కడి నుంచి చక్రాల కుర్చీలో సేవాదళ్ సభ్యులు ఆమెను దర్శనానికి తీసుకువెళ్లారు. పోలీస్ శాఖకు, దేవస్థానానికి, ప్రభుత్వానికి కృష్ణయ్య-రజని దంపతులు ధన్యవాదాలు తెలిపారు.

సంస్కృతి, కళల పూర్వవైభవానికి కృషి

» మంత్రి కందుల దుర్గేష్


వంపూరు గంగులయ్యతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

వన్‌టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రంలో జానపద కళలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడ పున్నమిఘాట్‌లోని హరిత రిసార్ట్ (బెరం పార్క్)లోని కాన్ఫరెన్స్ హాలులో జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా వంపూరు గంగులయ్యతో మంగళవారం ప్రమాణం స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కళలు, చారిత్రక, పర్యాటక రంగాల రంగాల ప్రాధాన్యత, చారిత్రక, పర్యాటక విషయాలను తెలియజేసేలా జరిగే కృషిలో కవులు, కళాకారులు, రచయితలకు సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. అంతరించిపోతున్న జానపద కళలకు రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. అతి త్వరలో రాజమండ్రికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వస్తుందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ అధికారులను మంత్రి ప్రశంసించారు. గంగులయ్య ఎంపిక సరైనది, సముచితమైనది అని కొనియాడారు. త్వరలోనే అనుబంధ శాఖల పోస్టుల నియామకం ఉంటుందన్నారు. గంగులయ్య మాట్లాడుతూ, జానపద కళలు, విజ్ఞానం, సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావటం ద్వారా పూర్వ వైభవం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ, మంత్రి దుర్గేష్ అద్భుతమైన రంగస్థల నటుడని కొనియాడారు. జన హృదయం నుంచి పుట్టిన జానపద కళల అభివృద్ధికి గంగులయ్య కృషిచేస్తారనే నమ్మకం ఉందన్నారు. సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్మన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ, రాష్ట్రంలో సాంస్కృతిక వికాసం మరింతగా పరిఢవిల్లేలా కృషి చేస్తామన్నారు. పాఠశాల, కళాశాలల్లో జానపద కళలు విద్యార్థులకు నేర్పించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. మంత్రి దుర్గేష్‌ను అభిమానులు గజమాలతో సత్కరించారు. పెందుర్తి, రంపచోడవరం ఎమ్మెల్యేలు శిరీషా దేవి, పంచకర్ల రమేష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డప్పల నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, వీర మహిళలు రాయపాటి సౌజన్య, అన్నపూర్ణ, గంగులయ్య కుటుంబసభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అడ్మిషన్లపై అనాసక్తి!

(5వ పేజీ తరువాయి)

విభాగంలో 33 సీట్లకు 20 మంది, బోటనీ విభాగంలో 33 సీట్లకు 27 మంది చేరారు. యూనివర్సిటీలో తొమ్మిది పీజీ కోర్సుల్లో 322 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, కేవలం 158 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సగం సీట్లు మిగిలిపోయాయి. యూనివర్సిటీలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు హాస్టల్ వసతి లేకపోవడంతో విముఖత చూపుతున్నారు. ఈ 158 మందిలో ఎంత మంది బుధవారం లోగా యూనివర్సిటీలో రిపోర్టు చేస్తారో కూడా తెలియనిస్థితి నెలకొంది. ఎంఏ ఇంగ్లీష్ కోర్సులో గత నాలుగు సంవత్సరాలుగా ఇద్దరు, లేక ముగ్గురే చేరుతున్నారు. వీరికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాఠాలు బోధిస్తున్నారు. ఏడాదికి ఈ కోర్సు నిర్వహణకు రూ.1.20 కోట్ల వరకు ఖర్చు చేయడం గమనార్హం. ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సును బోధించేందుకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నారు. విద్యార్థులు ఇద్దరికి మించి లేకపోవడంతో సంబంధిత అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర పనులు అప్పగించారు.

నేడు అకడమిక్ సెనెట్ సమావేశం

వర్సిటీ అకడమిక్ సెనెట్ సమావేశం బుధవారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో జరగనుంది. 2013లో యూనివర్సిటీ అకడమిక్ సెనెట్ సభ్యులను నియమించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఈ సెనెట్ సభ్యుల్లో మార్పులు, చేర్పులు చేయాలి. కానీ గత 12 ఏళ్లుగా పాత సభ్యులే కొనసాగుతున్నారు. విద్య, పారిశ్రామిక, సాంస్కృతిక, సేవా తదిరత రంగాల్లో విశిష్టసేవలు అందించి, ప్రఖ్యాతిగాంచిన వారిని ఈ సెనెట్‌లో సభ్యులుగా నియమిస్తారు. ఎప్పటికప్పుడు విద్యారంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకుని డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఈ సెనెట్‌లోని సభ్యులు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. అయితే 2013లో నియమితులైన సెనెట్ సభ్యుల్లో కొందరు తమ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ పొందడం, మరికొందరు విదేశాలకు వెళ్లిపోవడం వంటి ఘటనలు కూడా జరిగాయి. 2023లో అప్పటి వీసీ జ్ఞానమణి అకడమిక్ సెనెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత రెండేళ్లుగా ఈ సమావేశం జరగనేలేదు. బుధవారం జరిగే సమావేశానికి ఎంత మంది సభ్యులు హాజరవుతారనే అంశంపైనా స్పష్టత లేదు. ఈ సమావేశం జరిగితే గతంలో యూనివర్సిటీలో రద్దు చేసిన ఎం-ఫార్మసీ కోర్సును తిరిగి పునరుద్ధరించే అంశంతోపాటు వ్యాయామ విద్యకు సంబంధించిన కోర్సును ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే పునాదుల దశలో ఆగిపోయిన ఇంజనీరింగ్ కళాశాల, బాలుర వసతి గృహానికి సంబంధించిన భవనాల నిర్మాణం మళ్లీ ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం కూడా జరుగుతోంది.

వేదమయి..

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం నాలుగు గంటల సమయానికి 56,545 మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. 32 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ ఆ తర్వాత భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. తొలిరోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను రికార్డుస్థాయిలో 90 వేల మంది దర్శించుకొన్నారు. కాగా, కనకదుర్గమ్మ బుధవారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

దసరా ఏర్పాట్లు అద్భుతం..

» దుర్గమ్మను దర్శించుకున్న మాధవ్



లబ్బీపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రులు అంగరంగవైభవంగా జరుగుతున్నాయని, ఏర్పాట్లు కూడా అద్భుతంగా ఉన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేయడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉత్సవకమిటీ, అధికారులు చక్కగా వ్యవహరించారన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరి జీవితాల్లో అభివృద్ధి జరగాలని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు.

సీనియర్ అర్చకుడి అత్యుత్సాహం

» శంకర్ శాండిల్యపై ఈవోకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, ఇంద్రకీలాద్రి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రధాన ఆలయం వద్ద సీనియర్ అర్చకుడు శంకర్ శాండిల్య అత్యుత్సాహం ప్రదర్శించడంపై పలువురు అర్చకులు ఈవో శీనానాయక్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి మహానివేదన సమర్పిస్తున్న సమయంలో సీనియర్ అర్చకుడు శంకర్ శాండిల్య అత్యుత్సాహంతో దేవదాయ మంత్రి, కమిషనర్‌లను వెంటపెట్టుకుని అమ్మవారి ప్రధాన ఆలయంలోకి వెళ్లడంపై అర్చకస్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అర్చకులు ఈవోకు ఫిర్యాదు చేయగా.. ఈవో శంకర్ శాండిల్య తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేయడం చర్చకు దారితీసింది.

పనులకు బ్రేక్!

(5వ పేజీ తరువాయి)

వచ్చేశాయి. ప్రస్తుం చిన్న కాంట్రాక్టర్లకే బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం జీవో విడుదల చేయగానే.. తమ బిల్లులు వచ్చేస్తున్నాయని సంతోషంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లకు ఆర్థికశాఖ నుంచి ఎంతకీ డబ్బులు విడుదల కాకపోవటం తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇప్పటికే బిల్లులు ఇవ్వటం లేదని జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను చాలా వరకు కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఆర్థికశాఖ తీరు గురించి తెలుసుకున్నాక.. తాజాగా పూర్తిగా పనులు నిలుపుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా భారీ సంఖ్యలో బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయానికి వచ్చిన నివేదిక ప్రకారం రూ.700 కోట్ల మేర బిల్లింగ్ అయినట్టుగా తెలుస్తోంది. ఇందులో ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వం రూ. 152 కోట్లను విడుదల చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా చిన్న కాంట్రాక్టర్లు సగం బకాయిలు అయినా వస్తాయని ఆశించారు.

26న ఆందోళనలకు కాంట్రాక్టర్ల పిలుపు

జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) పనులకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను కాదని ఆర్థికశాఖ డబ్బులు చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ ఈనెల 26న ఆందోళన చేపట్టాలని కాంట్రాక్టర్లు పిలుపునిచ్చారు. ముందు ఈఎన్‌సీ కార్యాలయం దగ్గర అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత మంగళగిరిలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం దగ్గర ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పవన్ చొరవతోనే ప్రభుత్వం రూ.152 కోట్లను కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో)ను కూడా పవన్ ఇప్పించారని చెబుతున్నారు. దీనిపై ఆయనే మళ్లీ స్పందించి తమకు బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

కంకిపాడు నుంచి కర్నూలుకు ఏపీటీడీసీ ప్రత్యేక బస్సు సర్వీసు

బస్‌స్టేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) రానున్న సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని కంకిపాడు - కర్నూలు రూట్‌లో ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభించినట్లు డివిజనల్ మేనేజర్ కృష్ణచైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంకిపాడు - కర్నూలు టికెట్ రూ.625, కంకిపాడు - నంద్యాల రూ.525 టికెట్ ధరలతో ప్రత్యేక సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 8.30 గంటలకు కంకిపాడు నుంచి బయలుదేరి 9 గంటలకు బెంజ్ సర్కిల్, 9.15 గంటలకు వారధి వద్ద బస్‌స్టాప్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం హాల్ట్‌లు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కేంద్ర రిజర్వేషన్ కార్యాలయంలోనూ, మొబైల్ 9848007025లోనూ, టోల్ ఫ్రీ నెంబరు 1800-425-45454లో సంప్రదించవచ్చునని డివిజనల్ మేనేజర్ తెలిపారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

పెనమలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ తట్టుకోలేక పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కానూరు తులసీనగర్‌కు చెందిన విక్కుర్తి నాగరాజు (45) పండ్లు అమ్ముకొని జీవిస్తుంటాడు. అతను చాలా కాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. దానిని తట్టుకోలేక, నిరాశకు గురై సోమవారం పురుగు మందుతాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే నాగరాజు మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రచారం

కానూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం వద్దు.. గుడ్డ సంచే ముద్దు అనే నినాదంతో తాడిగడప మున్సిపాలిటీలోని గ్రామాల్లో మున్సిపల్ అధికారులు విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లోని దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధమని చెబుతూ స్టిక్కర్‌లు అంటిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ మంగళవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధికి తెలిపారు. వ్యాపారులు, వినియోగదారులు కూడా సహకరించాలని కోరారు.

చెత్తసేకరణకు స్వచ్ఛ రథం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వ ఆదేశాలు మేరకు స్వచ్ఛ రథం (మొబైల్ సూపర్ బజార్)ను ఏర్పాటు చేస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. బాపులపాడులో స్వచ్ఛ రథం ఏర్పాటుపై మంగళవారం పంచాయతీలో పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి పూర్ణేశ్వరితో ఎంపీడీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ లక్ష్మయ్య ఇతర అధికారులు పాల్గొని పలు సూచనలు చేశారు.



కేకు కట్ చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు అభినందనీయం

ఉయ్యూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ పాలసీలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రద్దు చేయడం అభినందనీయమని ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ఉయ్యూరు బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్.భూషణం అన్నారు. ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు సోమవారం నుంచి అమలులోకి రావడం పట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. జీఎస్టీ రద్దుతో పాలసీదారులకు లబ్ధి చేకూరుతుందని భూషణం పేర్కొన్నారు. కార్యదర్శి ఎస్.వి.రమణ, కోశాధికారి బి.రామకృష్ణ, పలువురు సభ్యులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

ఆదిత్య బధిర పాఠశాల నిర్వాహకుడికి కలెక్టర్ ప్రశంస

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బధిర విద్యార్థులకు విశేషసేవలు అందిస్తున్న స్థానిక ఆదిత్య బధిర విద్యాలయం ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ప్రశంసించి సత్కరించారు. బధిర సంకేత భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ సేవలను కొనియాడుతూ కలెక్టర్ శాలువతో సత్కరించి అభినందించారు. బధిర విద్యార్థులకు అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించినట్లు వెంకటరమణ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సతీష్



మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సతీష్

కంకిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ అన్నారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని కంకిపాడు వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలను నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 255 మందికి వైద్య సేవలందించి, మందులు పంపిణీ చేశారు. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శిరీష, జిల్లా వైద్యాధికారి ఏ. వెంకట్రావు, ప్రేమ్‌చంద్, చిరంజీవి, సీహెచ్‌సీ ఛైర్మన్ బోయిన రోహిణి, మాజీ ఛైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, కంకిపాడు వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసుజా, సాయి నికిత పాల్గొన్నారు.



మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, సర్పంచ్ విజయభాస్కర్

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటూ పోషకాహారంపై అవగాహన కలిగి ఉంటేనే కుటుంబం బాగుంటుందని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బొమ్ములూరులో సర్పంచ్ కాటూరి విజయభాస్కర్ అధ్యక్షతన మంగళవారం స్వస్త్‌నారీ - స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేన్సర్ లాంటి వ్యాధులకు భయపడాల్సిన అవసరం లేదని, ప్రాథమిక దశలో గుర్తించడం ద్వారా నివారించవచ్చన్నారు. కిశోర బాలికలకు గర్భిణులకు రక్తహీనత రాకుండా పోషకాహారం తీసుకోవడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. మునగాకు, తోటకూర లాంటి ఆకుకూరలు, జామ, దానిమ్మ లాంటి పండ్లు తక్కువ ఖర్చుతో ప్రతిరోజు తీసుకోవడం ద్వారా చాలా వ్యాధులను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సర్పంచ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఎసీఎస్ డైరెక్టర్ గుళ్లపూడి ప్రసాద్, దాసరి రాజేష్, టాటా ట్రస్ట్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలవపాములలో..

ఉయ్యూరు: కలవపాములలో కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్యాన్సర్ సంబంధిత, ఇతర వైద్యపరీక్షలు చేశారు. బీపీ, షుగరు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బోడె వెంకట్రామ్ శిబిరాన్ని ప్రారంభించగా పీహెచ్‌సీ వైద్యాధికారి శొంఠి శివరామకృష్ణారావు, వైద్యసిబ్బంది పాల్గొని సేవలందించారు.



గండిగుంటలో లేగదూడల ప్రదర్శన ప్రారంభిస్తున్న ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం.శ్రీనివాస్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ రాజీవ్

పెయ్యదూడల ఉత్పత్తికి కృషి

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం. శ్రీనివాస్

ఉయ్యూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల ఉత్పత్తికి కృషి చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం. శ్రీనివాస్ అన్నారు. గండిగుంటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిలకపాటి రాజీవ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, చిలకపాటి రాజీవ్ మాట్లాడుతూ, లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయటం వలన 90శాతం పెయ్యదూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. లేగ దూడల ప్రదర్శనలో 68 దూడలు పాల్గొనగా అందులో మాదాల సుబ్రమణ్యేశ్వరరావు, వల్లభనేని నాగభూషణం (భూషయ్య) దూడలకు ప్రథమ బహుమతి, తాతినేని వెంకట్రావు దూడలకు తృతీయ బహుమతి అందజేశారు. డీఎల్‌డీఏ గన్నవరం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సీహెచ్ చిననరసింహులు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రమోహన్, ఉయ్యూరు సంచాలకులు రామ్‌శేఖర్, మండల పశువైద్యాధికారి శ్రీకాంత్, ధనేకుల వీణ, ప్రకాశ్, మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, వల్లభనేని భూషయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ శివాజీబాబు

పీవీపీ సిద్ధార్థలో ముగిసిన సర్టిఫికెట్ కోర్సు

కానూరు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆర్టిస్ట్ ఇన్ మీ అనే థీమ్‌తో గత వారం రోజులుగా కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్టిఫికెట్ కోర్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థుల్లోని ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఈ కోర్సు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి, ఉమెన్ సెల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ పి. ఆదిలక్ష్మి, కోర్సు సమన్వయకర్తలు శిరీష, లావణ్య, రష్మీ పాల్గొన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థినులకు ప్రిన్సిపాల్ శివాజీబాబు సర్టిఫికెట్‌లను అందజేశారు.

గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



గాయత్రి మందిరంలో భక్తుల పూజలు

గన్నవరం, 23 సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలో దేవి శరన్న వరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్థానిక గాయత్రి మందిరంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కేవీ ఆర్ కిషోర్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు అన్నసం తర్పణ జరిపారు. పాత గన్నవరం లక్ష్మీతిరుప తమ్మ ఆలయంలో, వేంకటేశ్వర స్వామి ఆలయం, యాదవుల రామాలయంలో పూజలు జరిగాయి. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మల్లవల్లిలో నిర్వహిస్తున్న మహోత్సవాల్లో భాగంగా ఎన్ఎస్ఎల్పీ-72 ఆయకట్టుదారుల సంఘ అధ్యక్షుడు తమ్మిశెట్టి రాంబాబు, అరుణ దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు. రంగన్నగూడెంలో అమ్మవారికి మెరుగుమాల వెంకటేశ్వరరావు దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. **హనుమాన్‌జంక్షన్:** శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి దేవిని ఆదిలక్ష్మిగా అలంకరించారు. బాపులపాడు ఉప సర్పంచ్ దుట్టా శివన్నా రాయణ, హైమా దంపతులు అలంకరణ దాతలుగా వ్యవహరించారు. వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. బాపులపాడు శివాలయంలో భ్రమరాంబికాదేవిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. **ఉయ్యూరు :** స్థానిక జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గండిగుంట వంశీ రాయల్ సిటీ ఆవరణలో సాంబశివరావు, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాటూరులో కొలుసు పోతురాజు ఆధ్వర్యంలో, పెదఓగిరాల, చినఓగిరాల, ముదునూరు, కలవపాముల గ్రామాల శివాలయాల్లో దసరా శరన్న వరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.



బాలాత్రిపురసుందరీగా జగదాంబ

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

భారతీనగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణలో పురపాలక సంస్థ ఎంతో కీలకమైనదని, వీటి గురించి పూర్తిగా తెలుసుకుని పని చేస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చునని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ రీజనల్ డైరెక్టర్ చలపతిరాజ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాడిగడప, ఉయ్యూరు, కొండపల్లి పురపాలక సంస్థ శానిటరీ ఇనెస్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజనీర్స్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలు, మేస్త్రీలకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ కార్యక్రమం మంగళవారం మహనాడు రోడ్లోని పార్కు ఎన్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరాజ్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఉయ్యూరు, స్వచ్ఛ తాడిగడప, స్వచ్ఛ కొండపల్లిగా తీర్చిదిద్దాలంటే ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివన్నారాయణ, డి. ఫణికుమార్, ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలోని ఆర్వో ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న కమిషనర్ షేక్ నజీర్

ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌ల్లో ఆకస్మిక తనిఖీలు

కానూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు, తాడిగడప ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌ల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. తాడిగడపలో 16, యనమలకుదురులో 4 మొత్తం 20 ఆర్వో ప్లాంట్‌ల్లో తనిఖీలు చేశామన్నారు. ఈప్లాంట్‌కు ఎటువంటి అనుమతులులేవని, నీరు కూడా సరిగా శుద్ధి కావడం లేదని పేర్కొన్నారు. ఈఆర్వో ప్లాంట్‌ల నుంచి వచ్చే తాగునీటి వల్ల ఎటువంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా ఇటీవల కానూరులోని 17 ఆర్వో ప్లాంట్‌ల్లో కూడా తనిఖీ చేశామని, మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ ఆర్వో ప్లాంట్‌ల నిర్వాహకులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ షేక్ నజీర్ తెలిపారు.



ఉయ్యూరు సెంటర్‌లో ఆందోళన చేస్తున్న రోడ్డు ప్రమాద మృతుడి బంధువులు

రూ.15 లక్షలు పరిహారం చెల్లించాలి

రోడ్డు ప్రమాద మృతుడి బంధువుల ఆందోళన

ఉయ్యూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండిగుంట సమీపాన సోమవారం రాత్రి కారుఢీకొని మృతి చెందిన విన్నకోట శ్రీరాములు కుటుంబానికి రూ. 15 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు, బోరుపని యూనియన్ నాయకులు మంగళవారం ఉయ్యూరు సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. కారు యజమాని నుంచి రూ. 15 లక్షలు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు సర్దిచెప్పినా వినకపోవడంతో గన్నవరంలో బందోబస్తు డ్యూటీ నిర్వహిస్తున్న సీఐ టీవీవీ రామారావు, రూరల్ ఎస్సై సురేశ్‌బాబు సిబ్బందితో ఇక్కడకు చేరుకుని కారు నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని, కారు సీజ్ చేశామని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని సర్దిచెప్పినా వినకుండా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. పోలీసులపై వాగ్వాదానికి దిగారు. దీంతో సీఐ ఆందోళనకారులపై చట్టపరమైన చర్యలకు వెనుకాడమని గట్టిగా హెచ్చరించడంతో ఆందోళన విరమించారు.

పోషకాహారంతో పిల్లల్లో ఆరోగ్యకర అభివృద్ధి

ఉంగుటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యకర మనుగడకు, అభివృద్ధికి మంచి పోషక విలువలతో కూడిన సమతుల పోషకాహారం చాలా అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో జి.మంగమ్మ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆత్కూరు అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, సూపర్‌వైజర్ బి.పద్మాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : స్థానికంగా పండించే తాజా ఆహార పదార్థాలు, ఉత్పత్తుల ద్వారా తక్కువ ఖర్చుతో పోషకాలు పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర సూచించారు. కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో భాగంగా వోకల్‌ఫర్ లోకల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె భువనేశ్వరి, కుమారి, శాంతిసుశీల, జ్యోతి, లీలావతి, తదితర ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



ఆత్కూరులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జి.మంగమ్మ

ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్‌గా రామారావు

ఉయ్యూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మునిసిపల్ కమిషనర్‌గా జాస్తి రామారావును నియమిస్తూ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రామారావును ఉయ్యూరుకు బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉయ్యూరు కమిషనర్‌గా పనిచేసిన పాయసం వెంకటేశ్వరరావు జూన్ 31న ఉద్యోగ విరమణ చేశారు.



రేలారే రేలారే...



- మంత్ర ముగ్ధుల్ని చేసిన మోహినీ భస్మాసుర యక్షగాన ప్రదర్శన
- ఉర్రూతలూగించిన జానపదాలు
- కనువిందుగా కూచిపూడి నృత్యాల ప్రదర్శన
- భారీగా తరలివచ్చిన ప్రజలు

పవిత్ర సంగమాన్ని హోరెత్తించిన కళల విజయనర్తనం





ఆంధ్రజ్యోతి, విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పవిత్రసంగమంలో విజయనర్తనం హోరెత్తిస్తోంది. ఉత్సవాల రెండో రోజున యక్షగానాలు, జానపద నృత్యాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో పవిత్రసంగమం దద్దరిల్లింది. పవిత్ర సంగమం వేదికన చాన్నాళ్ల తర్వాత సంగీత ప్రదర్శనలు జరుగుతుండటంతో పొరుగున ఉన్న రాజధాని అమరావతి ప్రాంతాల ప్రజలతో పాటు, స్థానికంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పవిత్ర సంగమంలో గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకున్న ప్రతి ఒక్కరూ సంగీత ప్రదర్శనలను వీక్షించారు. కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయనర్తనం' ప్రేక్షకుల్ని ఆద్యంతం ఆనంద పరవశుల్ని చేసింది. బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవి బాలక్రిష్ణ బృందం ప్రదర్శించిన "మోహినీ భస్మాసుర" యక్షగానం ఆహూతలను మంత్రముగ్ధుల్ని చేసింది. ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్ల వర్షం కురిపించుకున్న ఈ ప్రదర్శన సాంస్కృతిక వాతావరణాన్ని మరింత పెంచింది.

జనరంజకంగా జానపదాల ప్రదర్శన

గుడివాడకు చెందిన యాదవల్లి వీరయ్య బృందం ఆలపించిన జానపద గానం శ్రోతలను ఉర్రూతలూగించింది. ఒకవైపు జానపదంతో ఇంకోవైపు హాస్యవల్లరితో ప్రేక్షకులకు కళావిందు చేశారు. రే లారె రేలా అడివితల్లికి దండాలు వంటి జానపదాలతో పాటు అమ్మవారి భక్తి గీతాలతో చిందులేస్తూ జానపద బృందం దుమ్ము లేపారు. నాట్యాచార్య చదలవాడ ఆనంద్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు రంజింపజేశాయి. 32 మంది విద్యార్థుల బృందంగా నర్తించి అలరించారు. 4 గంటల పాటు సాగిన ఈ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకుల్ని అలరించాయి. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సంప్రదాయానికి సంబంధించిన అన్ని రకాల కళలను కళాకారులను ప్రోత్సహిస్తూ విజయనర్తనం నిర్వహిస్తున్నామన్నారు. కమిషనర్ రమ్య కీర్తన కళాకారులకు జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందించారు.

విజయవాడలో కనువిందుగా కళావేదికలు

విజయవాడ ఉత్సవాల్లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా జరిగిన కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆనంద డోలికల్లో ముంచెత్తాయి. అనుష నాయుడు బృందం ఐగిరి నందిని, నారాయణతే నమో నమో, అన్నమాచార్య సంకీర్తనలకు నర్తించారు. అనంతరం తుషార పూర్ణవల్లి విద్యార్థుల గాత్ర బృందం శ్రోతలను పరవశింపజేసింది. అనంతపురం నుంచి వచ్చిన సీ రాము బృందం ఉరుములు కళారూపం ఆకర్షణీయంగా సాగింది. కాకినాడకు చెందిన తోటా బాలకృష్ణ తోలు బొమ్మలాట ప్రదర్శనలో సుందరకాండ కథను వినిపించారు. విజయ్ కుమార్ కర్రసాము/కత్తిసాము నృత్యం ఆకట్టుకుంది. భూకైలాష్ ఉషోదయ నాటకమండలి, చెరుకూరు బృందం ప్రదర్శించిన ఈ ప్రదర్శన ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల వేదికగా రెండో రోజు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. నగరానికి చెందిన నాట్యాచార్యుడు కే వాసుదేవరావు బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను ఆకర్షించింది.

యాదవల్లి చిన్నారుల బృందం ఆలపించిన భక్తి కీర్తనలు అలరించాయి. శైలశ్రీ బృందం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలు, రాజరాజేశ్వరి అష్టకం, నవదుర్గలు, కామాక్షి స్తుతి, జయజయవైష్ణవి మైమరిపించాయి. చిన్నా, అబ్బులు బృందం సుందరకాండ కథను 8 మంది బృందంతో తోలుబొమ్మలాట ఆడించి అలరించారు. విజయ్‌కుమార్ బృందం కర్రసాము ప్రదర్శించగా, నగరానికి చెందిన ఎమ్మెస్ చౌదరి దర్శకత్వంలో ప్రపంచతంత్రం పేగు రాసిన శాసనం నాటిక ఆకట్టుకుంది.

విజయవాడ ఉత్సవ్‌లో

నేటి ప్రదర్శనలు

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 3వ రోజ బుధవారం విజయవాడ ఉత్సవ్ వేదికల్లో నిర్వాహకులు పలు కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమాలు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

పున్నమిఘాట్‌లో

సింగర్ గీతామాధురి లైవ్ మ్యూజిక్, శ్రీలేఖ బృందం శాస్త్రీయ ప్రదర్శన, దీప్తి బృందం మహాభారత ప్రదర్శన, గీత భక్తి ప్రదర్శన, కామాక్షి బృందం వయోలిన్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

ఘంటశాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

నగరానికి చెందిన జి.నీలవేణి శిష్య బృందం కథక్(సోలో, చిత్రా రామలక్ష్మీ వీణ వాయిద్యం, బి.సౌమ్య భరతనాట్యం, అనంతపురానికి చెందిన సి.రాములు ఉరుములు, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శనలు ఉన్నాయి.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో

నగరానికి చెందిన డాక్టర్ అపర్ణ శిష్య బృందంతో కూచిపూడి నాట్యం, పామర్రు ప్రగతి ఇన్స్టిట్యూట్ వారు బృందావన చెక్క భజన, తెనాలికి చెందిన నాగమణితో హరికథ కార్యక్రమం, కాకినాడకు చెందిన తోట పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తోలు బొమ్మలాట, విముక్తి/పీపీలకం సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారు.

విజయవాడ ఎక్స్‌పో మరింత ఆలస్యం

- మరో రెండ్రోజులు పట్టే అవకాశం



గుడారం నిర్మాణం వద్ద పనులు చేస్తున్న కూలీలు

ఇబ్రహీంపట్నం: విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో విజయవాడ ఎక్స్‌పో పేరుతో నిర్వహించే ఎగ్జిబిషన్ ప్రారంభానికి మరో రెండ్రోజులు పట్టేలా ఉంది. ఈనెల 22న దసరా శరన్నవరాత్రుల ప్రారంభం రోజునే విజయవాడ ఎక్స్‌పో ప్రారంభం కావాల్సి ఉంది. అయితే భారీ వర్షాలతో మైదానం చిత్తడిగా మారడంతో ఏర్పాట్లు ముందుకు సాగలేదు. దీంతో పెద్ద ఎత్తున జీఎస్‌పీ తెప్పించి మైదానం మొత్తం చల్లించి పవర్ రోలర్‌తో చదును చేయిస్తున్నా అక్కడక్కడా మైదానంలో నీళ్లు నిలుస్తూనే ఉన్నాయి. వాటిని సెప్టిక్‌ట్యాంక్‌లతో తోడిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి రెండు గుడారాలు వేయగలిగారు. ఇక జెయింట్ వీల్స్ ఏర్పాట్లు పూర్తి కాలేదు. ఎక్కడ ఆట వస్తువులు అక్కడే ఉన్నాయి. వర్షం ఇలానే పడితే మాత్రం విజయవాడ ఎక్స్‌పో మరింత ఆలస్యం కావడం ఖాయం. పుష్కర కాలం తర్వాత గొల్లపూడిలోని దేవాలయ భూమిలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విజయవాడ ఔన్నత్యాన్ని దేశం నలుమూలలకు, ప్రపంచానికి తెలిసేలా చేయాలనుకుంది. ఇది గిట్టని కొందరు వ్యక్తులు దాన్ని రాజకీయం చేసి దొంగ సంతకాలతో కోర్టును ఆశ్రయించారు. దీంతో కొద్ది రోజులు పనులు ఆగిపోయాయి. సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చేసరికి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. ఏర్పాట్లు పూర్తయ్యి ఎక్స్‌పో ప్రారంభమయితే భక్తుల వాహనాలను పార్కింగ్ చేయడం పెద్ద సవాల్. ఎగ్జిబిషన్‌కు అర కిలో మీటర్ దూరంలోని ఓ ప్రైవేటు స్కూల్ మైదానంలో వాహనాలు నిలిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీ, వీవీఐపీ వాహనాలు నేరుగా ఎగ్జిబిషన్ మైదానంలో లోనికి వచ్చి బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బాలారిష్టాలన్నీ పూర్తి చేసుకొని ఎక్స్‌పో ప్రారంభమయ్యేందుకు మరి కొద్దిరోజులు ఆగాల్సిందే. ఎక్స్‌పో ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని నగర ప్రజలతో పాటు అనేక ప్రాంతాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎగ్జిబిషన్ ప్రాంతానికి వచ్చి పనులు జరుగుతుండటం చూసి నిరాశగా వెనుతిరిగి వెళుతున్నారు.

ఉత్సవ్‌కు.. నేడు ఉప రాష్ట్రపతి రాక!

- పున్నమిలో నిర్వాహక కమిటీ ఏర్పాట్ల పరిశీలన
- పలు రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు సైతం హాజరు
- 28న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, 29న కేంద్ర మంత్రి రామ్మోహన్ రాక
- ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎంపీ



ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా అధికారులు, పోలీసులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ ఉత్సవ్ విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. ఈ ఉత్సవంలో తదుపరి ఘట్టాలు ఎంతో ఆసక్తిగా, ఉత్సాహంగా ఉంటాయన్నారు. బుధవారం పున్నమిలో జరిగే కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీకే రాధాకృష్ణన్‌తో పాటు ఉత్సవాలకు పలువురు గవర్నర్లు, కేంద్ర మంత్రులు హాజరవుతారన్నారు. ఈనెల 28న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, 29న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొంటారన్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ శివనాథ్ పలువురు నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల తర్వాత నగర వాసులు విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలను ఆస్వాదించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి..

ఇంద్రకీలాద్రి: విజయవాడలో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా బుధవారం నగరానికి విచ్చేస్తున్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ దుర్గగుడిలో కనకదుర్గమ్మను దర్శించుకోనున్నారు. ప్రత్యేక సెక్యూరిటీ లైజన్ అధికారులు దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో కలిసి కొండపై తనిఖీలు నిర్వహించారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉపరాష్ట్రపతికి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లతో పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన దర్శనానికి రానున్నారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అధికారులతో కలిసి కొండపై ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు.



తగ్గిన ధరతో వినియోగదారుడికి కారును అందజేస్తున్న మారుతీ సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి తదితరులు

జీఎస్టీ తగ్గడంతో అందుబాటులోకి మారుతీ కార్లు

- రాష్ట్రంలో వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తాం
- మారుతీ సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి వెల్లడి

కానూరు, ఆంధ్రజ్యోతి: జీఎస్టీ తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తమ కలలు సాకారం చేసుకునేందుకు మారుతి కార్లు అందుబాటులో ఉన్నాయని మారుతి సుజుకి ఎండీ, సీఈవో హిసాషి టకేచి వెల్లడించారు. విజయవాడ కానూరులోని మారుతి సుజుకి డీలర్ సంతోష్ మారుతి షోరూమ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొత్త జీఎస్టీ 2.0 అమలుతో ఎంపిక చేసుకున్న కార్లపై కంపెనీ నుంచి సుమారుగా రూ. 1.29 లక్షల వరకు ధర తగ్గుతుందన్నారు. దేశంలో ఈ ఫర్ మీ విజన్‌తో కొత్త ఈవీ కార్ల శకం ప్రారంభమౌతోందని, రాష్ట్రంలో మారుతి సేల్స్ బాగున్నాయని, ఈవీ కార్లకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీలో తమ వ్యాపారాన్ని విస్తరిస్తామని, సేల్స్‌తోపాటు సర్వీస్‌కు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్లలో సేఫ్టీని మరింతగా పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మారుతీ సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుయోషి టకేషిత, సర్వీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామ్ సురేష్ ఆకెళ్ల, శిరాషి టకహిరో పాల్గొన్నారు. ముగ్గురు కస్టమర్‌లకు తగ్గిన రేట్లతో కార్లను అతిథులు అందజేశారు. షోరూంలోని సర్టిఫైడ్ ప్రొఫెషనల్స్‌ను సత్కరించారు.

డీఎస్సీ అభ్యర్థుల విజయోత్సవ సభకు సన్నాహాలు

- 3 నుంచి అభ్యర్థులకు శిక్షణా తరగతులు: డీఈవో

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల విజయోత్సవ సభకు కృష్ణాజిల్లాలో ఎంపికైన 1283 మంది అభ్యర్థులను తీసుకుని వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు డీఈవో పీవీజే రామారావు పేర్కొన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని డీఈవో కార్యాలయ సమావేశపు హాలులో ఎంఈవోలతో అభ్యర్థులను వెలగపూడి తీసుకుని వెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లను డీఈవో సమీక్షించారు. కృష్ణాజిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులందరూ పామర్రు ప్రగతి కళాశాలకు బుధవారం సాయంత్రానికి చేరుకోవాలన్నారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరిని తీసుకురావచ్చని సమాచారం పంపుతున్నామన్నారు. బుధవారం రాత్రి అక్కడే బసచేస్తారన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ అభ్యర్థులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. గురువారం ఉదయం 62 ఆర్టీసీ బస్సుల్లో పామర్రు ప్రగతి కళాశాల నుంచి వెలగపూడి విజయోత్సవ సభకు అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకుని వెళ్తామన్నారు. వీరికి పామర్రు కళాశాలలో భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమం పూర్తయ్యాక అభ్యర్థులను, కుటుంబ సభ్యులను పామర్రు ప్రగతి కళాశాలకు తీసుకువస్తామన్నారు. ఏర్పాట్లకు డీవైఈవోలు, ఎంఈవోలు బాధ్యత వహించాలన్నారు.

ఫైనాన్షియర్ వేధింపులకు ఆటోడ్రైవర్ ఆత్మహత్య



నిరసన ప్రదర్శన చేస్తున్న ఆటోడ్రైవర్లు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ ఆటో ఫైనాన్షియర్ వేధింపుల కారణంగా మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమాను కోరడంతో పాటు తన మృతికి కారణమైన ఫైనాన్షియర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐని కోరుతూ సూసైడ్ నోట్‌ను రాశాడు. పసుపులేటి సుబ్బారావు (22) స్థానిక కృష్ణాహోటల్ సెంటర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్యను, 10 నెలల కొడుకును సోమవారం అత్తగారింటికి పంపించాడు. మంగళవారం ఉదయం ఫోన్లు ఎత్తకపోవడంతో స్నేహితులు ఇంటికి వెళ్లి చూడగా గడియ పెట్టి ఉంది. తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా సుబ్బారావు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సూసైడ్ నోట్‌ను గమనించారు. అందులో తన ఆత్మహత్యకు కారణం ఆటో ఫైనాన్స్ ఇచ్చిన సత్యనారాయణ అనే వ్యక్తి అని పేర్కొన్నాడు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐని వేడుకున్నాడు. ఎమ్మెల్యే బొండా ఉమా తనకు మూడు సార్లు సాయం చేశారని తన మృతి అనంతరం కుటుంబాన్ని ఆదుకోవాలని, భార్యకు ఇల్లు కేటాయించాలని వేడుకున్నాడు. సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన ప్రదర్శన

సత్యనారాయణపురం: బావాజీపేట ఆటోఫైనాన్సర్ వేధింపులతో సుబ్బారావు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న టీఎన్‌టీయూసీ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు గరిమెళ్ల చిన్నా ఆధ్వర్యంలో బావాజీపేట ఫైనాన్స్ ఆఫీసు వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లు నిరసన ప్రదర్శన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. గరిమెళ్ల చిన్నా మాట్లాడుతూ మృతుడు పసుపులేటి సుబ్బారావు సోమవారం ఫైనాన్స్ ఆఫీసుకు వెళితే రూ.55వేల బాకీ ఉంటే రూ.45 వేల వడ్డీ విధించారని మొత్తం రూ.లక్ష కట్టమన్నారని, అంత కట్టలేనని చెప్పినా నానా మాటలనడంతో సుబ్బారావు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఆటో డ్రైవర్ మృతికి కారణమైన ఫైనాన్సర్ సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లెనిన్ సెంటర్ ఆటోయూనియన్ డ్రైవర్లతో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

జెన్కో మొండి వైఖరి వీడాలి

- ఐదో రోజుకు చేరిన ఉచిత బూడిద రిలే నిరసన దీక్షలు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దీక్షాదారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సంస్థకు యాష్ పాండ్‌లోని బూడిదను అమ్ముకొని జెన్కో సంస్థ తమ పొట్ట కొట్టిందని తక్షణం టెండర్‌ను రద్దు చేసి ఉచితంగా బూడిద లోడింగ్ చేస్తామని హామీ ఇవ్వాలని స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్ డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు సమీపంలో డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరసన దీక్షలు మంగళవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా యాష్ పాండ్ బూడిద అమ్ముకుంటే వచ్చే లాభం ఎంతో ఆ మొత్తం తానే చెల్లిస్తానని స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చెప్పినా జెన్కో మొండి వైఖరిని వీడకపోవడం ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణం బూకటపు టెండర్‌ను రద్దు చేసి స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్యంపై మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే వసంత

డాక్టర్ ఎన్టీటీపీఎస్ వల్ల వెలువడుతున్న బూడిద కాలుష్యంపై దాని వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై బూడిదను కాంట్రాక్టుకు అప్పగించడం వల్ల స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌కు కలిగే నష్టంపై ఏపీ అసెంబ్లీలో మాట్లాడిన ఏకైక ఎమ్మెల్యే మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అని ఎన్టీటీపీఎస్ కాలుష్య పోరాట సమితి అధ్యక్షుడు, జనసేన నేత చెరుకుమల్లి సురేష్ అన్నారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎన్టీటీపీఎస్ కాలుష్య కోరల్లో ఈప్రాంత ప్రజలు చిక్కుకొని విలవిల్లాడుతుంటే పట్టించుకున్న నాథుడు లేడన్నారు. ఇప్పుడు ప్రజల పక్షాన ఎమ్మెల్యే తన వాదనను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి ఎన్టీటీపీఎస్ వల్ల కలిగే అనర్థాలను తీసుకెళ్లారన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంపై స్పందించినందుకు సురేష్ హర్షం వ్యక్తం చేశారు.

అధిక రాబడి ఆశ చూపి రూ.24.44 లక్షలకు టోకరా

పెనమలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐపీవో కొనుగోలు చేసి పెట్టుబడి పెడితే అధిక రాబడి వస్తుందని ఆశ చూపి ఒక వ్యక్తి నుంచి రూ.24.44లక్షలు దోచేసిన సైబర్ మోసంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన రవికుమార్‌కు ఐసీఐసీఐ స్టాక్ ఎక్స్ఛేంజ్ పేరుతో ఒక వాట్సాప్ గ్రూపులో చేరినట్టు మెసేజ్ వచ్చింది. వారు అటెన్ పేపర్స్ అండ్ ఫోమ్ లిమిటెడ్ ఐపీవోను రూ.30లక్షలు పెట్టి కొనుగోలు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఒత్తిడి చేయగా రవికుమార్ నమ్మి విడతల వారీగా 24.44లక్షలు పెట్టుబడి పెట్టాడు. కొంతకాలం తర్వాత డబ్బును విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా విత్‌డ్రా కాలేదు. వారికి ఫోన్‌లు చేస్తున్నా సమాధానం లేకపోయేసరికి మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

// అసెంబ్లీ వాయిస్ //

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపర్చండి

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతికుండగానే ప్రజలకు నరకం చూపించిన వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడ్డ జగనన్న కాలనీల్లో వసతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. జగనన్న కాలనీల్లో నివసిస్తున్న ప్రజల దయనీయ స్థితిని వివరించిన ఎమ్మెల్యే, కాలనీల్లో పరిస్థితులు ఆత్మహత్యలు చేసుకొనేలా ఉన్నాయన్నారు. ఇల్లు కట్టుకోవడానికి గృహనిర్మాణ శాఖ ద్వారా రుణాలు ఇప్పించి బలవంతంగా ఇళ్లు నిర్మింపజేయడంతో కాలనీవాసులు అప్పుల పాలై దీనస్థితికి దిగజారారన్నారు. ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించాలని కోరారు.

ఉప్పలూరు వంతెన పునర్నిర్మించాలి..

కంకిపాడు: ఉప్పలూరు బుడమేరు వంతెన శిథిలావస్థకు చేరిందని, పెను ప్రమాదం చోటు చేసుకోకముందే వంతెన పునఃనిర్మించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని కంకిపాడు - గన్నవరం రోడ్డులోని ఉప్పలూరు వద్ద ఉన్న బుడమేరు వంతెన బ్రిటీష్ కాలంలో నిర్మించారని, అది శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే కుందేరు గ్రామంలో రైవస్ కాలువపై వంతెన కూలిపోవడంతో ఏర్పాటు చేసిన బైలీ బ్రిడ్జి సైతం కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. పక్కనే నిర్మించిన వంతెన పూర్తి కాకపోవడంతో కుందేరు నుంచి కందలంపాడు, మానికొండ, కాటూరు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నానని తెలిపారు.

చంద్రబాబు నిర్ణయం పొరుగు రాష్ట్రాలకు ఆదర్శం

- ఎస్సీ వర్గీకరణపై వర్ల కుమార్‌రాజా



పామర్రు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు తీసుకున్న నిర్ణయం పొరుగు రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలవడం రాష్ట్రానికెంతో గర్వకారణమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో రుగ్మతలను తొలగించడానికి గతంలో 42 సూచనలు ప్రవేశ పెడితే నాటి అసెంబ్లీలో వాటన్నింటినీ కేబినెట్‌లో ఆమోదించి దళితులపై తనకున్న అభిమానాన్ని చంద్రబాబు నిరూపించుకున్నారన్నారు. ఇటీవలే కర్నాటక రాష్ట్రం అసెంబ్లీ బృందం వచ్చి పరిశీలించి వెళ్లారన్నారు. చంద్రబాబు విజన్‌తోనే వర్గీకరణ నోచుకోవడం హర్షణీయమన్నారు.

25న బహిరంగ సభను జయప్రదం చేయండి: యూటీఎఫ్

పాయకాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న గుంటూరులో జరగనున్న రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య కోరారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తవుతున్నా సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండోరోజు ఆదాయం రూ.25.48లక్షలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి దసరా మహోత్సవాలలో రెండవరోజు సాయంత్రం వరకు దేవస్థానానికి వివిధ రూపాల్లో మొత్తం రూ.25,48,725లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్ల ద్వారా రూ.8,99,400లు, రూ.100ల ద్వారా రూ.3,16,200లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.1,86,930లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.9,66,700లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.69వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్ల ద్వారా రూ.30వేలు, పరోక్ష ప్రత్యేక శ్రీచక్రనవావరణార్చన (టిక్కెట్ రూ.3వేలు) టిక్కెట్ల ద్వారా రూ.9వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.20,464లు, పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.5,585లు, తలనీలాల సమర్పణకు (టిక్కెట్ రూ.40) టిక్కెట్ల ద్వారా రూ.36,480లు, ఇతరత్రా ఆదాయం రూ.8,966లు మొత్తం కలిపి రూ.25,48,725లు లభించినట్లు ఈవో వివరించారు. సాయంత్రం వరకు భక్తులు 60,641 మంది అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో ప్రకటనలో తెలిపారు.

కొండంత భక్తి..



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోడానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. గాయత్రీదేవి అలంకారంలో దుర్గమ్మను ప్రముఖులు పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఏఐ టెక్నాలజీ సహాయంతో అధికారులు కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు గణాంకాలను లెక్కిస్తున్నారు.

అడుగడుగునా.. నిఘా!

విజయవాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి చుట్టూ అధికారులు డేగ కన్నేసి ఉంచారు. గుడివైపు కదిలే ప్రతి అడుగు, ప్రతి వాహనంపై అత్యంత నిఘా పెట్టారు. ఘాట్ల నుంచి భక్తులు దర్శనానికి వెళ్లి వచ్చే వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. టోల్‌గేట్లు, పార్కింగ్ స్థలాలు, వాహనాల వివరాలు, ఇలా క్షణాల్లో సమాచారం.. సేకరిస్తున్నారు. అన్న ప్రసాదం స్వీకరించేది ఎందరు.. లడ్డూ ప్రసాదాల వద్ద ప్రతి అంశాన్ని సెకన్లలో తెలుసుకుంటున్నారు. నగరానికి వచ్చిపోయే రైళ్లు.. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల విషయంలో అధికారులు పక్కా ప్రణాళికతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే విషయాలన్నీ సెకన్ల వ్యవధిలో అధికారుల చేతుల్లో లెక్కలు ఉంటున్నాయి. ఈసారి దసరా వేడుకల్లో అధికారులు ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ఎప్పటికప్పుడు పక్కాగా లెక్కిస్తున్నారు.

మోడల్ కంట్రోల్‌రూం

కీలాద్రికి వచ్చే దారులన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయి. ఫుటేజీలను వీక్షించడానికి వీలుగా స్క్రీన్లను దుర్గాఘాట్‌ను ఆనుకుని ఉన్న మోడల్ గెస్ట్‌హౌస్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటుచేశారు. వినాయకస్వామి గుడి, బస్టాండ్, సీతమ్మపాదాల ఘాట్ నుంచి వచ్చే అన్నిదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. అదే విధంగా పున్నమిఘాట్ సహా కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే రహదారిలోను సీసీకెమెరాలతో నిఘా పెట్టారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, భక్తులకు ఇబ్బందులు కలిగినా క్షణాల్లో స్పందించేలా మానటరింగ్ చేస్తున్నారు.

క్షణాల్లో సమాచారం..

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300, ప్రోటోకాల్ టిక్కెట్లు తీసుకుని ఎంతమంది భక్తులు వస్తున్నారు. ఎంతమంది దర్శించుకుంటున్నారు వివరాలు క్షణాల్లో కనిపించే విధంగా అధికారులు స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తుల్లో ఎంతమంది అన్నప్రసాదం తీసుకుంటున్నారు. లడ్డూలు ఎంతమంది తీసుకుంటున్నారనే వివరాలు పక్కాగా లెక్కిస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో నిమిషానికి ఎన్నివాహనాలు పార్కింగ్‌కు వస్తున్నాయి, ఎన్ని వెళుతున్నాయి, ప్రస్తుతం ఎన్ని పార్కింగ్‌లో ఉన్నాయనే వివరాలుసేకరిస్తున్నారు. దీనితో పాటు నో పార్కింగ్ జోన్లలో పెట్టిన వాహనాలను క్షణాల వ్యవధిలో టోయింగ్ వాహనం వచ్చి తీసుకెళ్లి దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మోడల్ గెస్ట్‌హౌస్‌లో రైల్వే సమాచార స్క్రీన్‌ను ఏర్పాటుచేసి సిబ్బంది మైక్‌ల ద్వారా సమాచారమిస్తున్నారు.

సీతమ్మవారి పాదాల వద్ద సిబ్బంది నిర్లక్ష్యం

సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద స్నానాలు చేయడానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఘాట్‌లో నాలుగు చోట్ల ఏర్పాటు చేసిన జల్లు స్నానాల ట్యాబ్‌ల్లో సిబ్బంది రెండు మాత్రమే వదిలారు. మిగతా రెండింటి ద్వారా నీటిని వదలలేదు. వాటిద్వారా నీటిని వదలాలని అడిగినా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రెండుచోట్ల భక్తుల తాకిడి ఎక్కువై స్నానాలు చేయడానికి ఇబ్బంది పడ్డారు.

బస్టాప్ వైపు నుంచి వచ్చే వాహనదారులకు కనకదుర్గ ఫ్లైఓవర్ వద్దే అడ్డుకట్ట

ఎన్‌హెచ్ 65, బస్టాప్ వైపుగా వచ్చే వాహనదారులను కనకదుర్గ ఫ్లైఓవర్ మీదగా మళ్లించారు. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. ఎంత ప్రయత్నించినా పోలీసులు విడిచిపెట్టకపోవడంతో వెనుదిరిగి ఏలూరు రోడ్డు- వినాయకస్వామి గుడి వైపు వెళ్లే ఫ్లైఓవర్ మీదగా వెళుతున్నారు.

క్షణాల్లో వ్యర్థాల తొలగింపు పనులు..

భక్తులు వాడిపడేసిన కవర్లు, వాటర్‌బాటిళ్లు, ఇతర వ్యర్థపదార్థాల కోసం వీఎంసీ ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేసింది. కొంతమంది భక్తుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. దీనితో పాటు ఘాట్‌లలో స్నానాలుచేసే కొంతమంది భక్తులు వస్త్రాలు వదిలేస్తున్నారు. వీటిని పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఏరివేస్తూ రోడ్లు, ఘాట్లను పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

ప్రత్యక్ష పూజలకే భక్తుల మొగ్గు

▸ పరోక్ష పూజలపై విముఖత!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ఇంద్రకీలాద్రి) : కనకదుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. దసరా ఉత్సవాలలోనూ ఇది కొనసాగుతుంటుంది. ఈ ఉత్సవాలలో సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రత్యేక పూజల సంఖ్య తగ్గించి.. పరోక్షంగా పూజలు వీక్షించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టినా భక్తులు ప్రత్యక్ష పద్ధతికే మొగ్గు చూపుతున్నారు. రోజుకు 200 మంది భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటుండగా.. పరోక్షంగా కేవలం 30 మంది వరకే పాల్గొంటున్నారు. దసరా ఉత్సవాలలో మహామండపంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, శ్రీచక్ర నవార్చన, ఖడ్గమాల, చండీహోమం వంటి పూజలు ప్రత్యేకంగా జరుగుతున్నాయి. రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు టిక్కెట్ల ధరలు ఉండే ఈ ప్రత్యేక పూజలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. సామాన్య భక్తుల కోసం కొండ మీద రద్దీ తగ్గించేందుకు ఈ దసరా ఉత్సవాలలో పరిమిత సంఖ్యలో రెండు షిఫ్టుల్లో 200 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులోనే చండీహోమం పూజకు 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది. పరోక్ష విధానంలో పూజల్లో పాల్గొనేవారికి లైవ్ లింక్‌ను పంపిస్తారు. దానిని వీక్షిస్తు పూజ ముగిశాక.. అమ్మవారి ప్రసాదాలు, వస్త్రం, రాగి డాలర్ తదితరాలను వారి ఇంటికి పంపిస్తారు. కానీ, పరోక్ష పూజలో ఆశించినంతగా భక్తులు పాల్గొనలేదు. ప్రత్యక్ష పూజలు మాదిరిగా పరోక్ష పూజలను అనుభూతి చెందలేకపోతున్నామన్నది భక్తుల అభిప్రాయంగా ఉంది.

పనులకు బ్రేక్!

(5వ పేజీ తరువాయి)

వచ్చేశాయి. ప్రస్తుం చిన్న కాంట్రాక్టర్లకే బకాయిలు రావాల్సి ఉంది. ప్రభుత్వం జీవో విడుదల చేయగానే.. తమ బిల్లులు వచ్చేస్తున్నాయని సంతోషంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్లకు ఆర్థికశాఖ నుంచి ఎంతకీ డబ్బులు విడుదల కాకపోవటం తీవ్ర నిరాశను కలిగిస్తోంది. ఇప్పటికే బిల్లులు ఇవ్వటం లేదని జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులను చాలా వరకు కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ఆర్థికశాఖ తీరు గురించి తెలుసుకున్నాక.. తాజాగా పూర్తిగా పనులు నిలుపుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా భారీ సంఖ్యలో బకాయిలు ఉన్నట్టు తెలుస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయానికి వచ్చిన నివేదిక ప్రకారం రూ.700 కోట్ల మేర బిల్లింగ్ అయినట్టుగా తెలుస్తోంది. ఇందులో ప్రాధాన్యతాక్రమంలో ప్రభుత్వం రూ. 152 కోట్లను విడుదల చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా చిన్న కాంట్రాక్టర్లు సగం బకాయిలు అయినా వస్తాయని ఆశించారు.

26న ఆందోళనలకు కాంట్రాక్టర్ల పిలుపు

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను కాదని ఆర్థిక శాఖ డబ్బులు చెల్లించకపోవటాన్ని నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన ఆందోళన చేపట్టాలని కాంట్రాక్టర్లు పిలుపునిచ్చారు. ముందు ఈఎన్‌సీ కార్యాలయం దగ్గర అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత మంగళగిరిలోని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయం దగ్గర ఆందోళన చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పవన్ కలాణ్ చూపిన చొరవ కారణంగానే ప్రభుత్వం రూ.152 కోట్లను కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌వో)ను కూడా పవన్ కళ్యాణ్ ఇప్పించారని చెబుతున్నారు. దీనిపై ఆయనే మళ్లీ స్పందించి తమకు బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

అడ్మిషన్లపై అనాసక్తి!

(5వ పేజీ తరువాయి)

విభాగంలో 33 సీట్లకు 20 మంది, బోటనీ విభాగంలో 33 సీట్లకు 27 మంది చేరారు. యూనివర్సిటీలో తొమ్మిది పీజీ కోర్సుల్లో 322 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, కేవలం 158 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సగం సీట్లు మిగిలిపోయాయి. యూనివర్సిటీలో చేరేందుకు వచ్చిన విద్యార్థులు హాస్టల్ వసతి లేకపోవడంతో విముఖత చూపుతున్నారు. ఈ 158 మందిలో ఎంత మంది బుధవారం లోగా యూనివర్సిటీలో రిపోర్టు చేస్తారో కూడా తెలియనిస్థితి నెలకొంది. ఎంఏ ఇంగ్లీష్ కోర్సులో గత నాలుగు సంవత్సరాలుగా ఇద్దరు, లేక ముగ్గురే చేరుతున్నారు. వీరికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాఠాలు బోధిస్తున్నారు. ఏడాదికి ఈ కోర్సు నిర్వహణకు రూ.1.20 కోట్ల వరకు ఖర్చు చేయడం గమనార్హం. ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సును బోధించేందుకు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నారు. విద్యార్థులు ఇద్దరికి మించి లేకపోవడంతో సంబంధిత అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర పనులు అప్పగించారు.

నేడు అకడమిక్ సెనెట్ సమావేశం

వర్సిటీ అకడమిక్ సెనెట్ సమావేశం బుధవారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో జరగనుంది. 2013లో యూనివర్సిటీ అకడమిక్ సెనెట్ సభ్యులను నియమించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఈ సెనెట్ సభ్యుల్లో మార్పులు, చేర్పులు చేయాలి. కానీ గత 12 ఏళ్లుగా పాత సభ్యులే కొనసాగుతున్నారు. విద్య, పారిశ్రామిక, సాంస్కృతిక, సేవా తదితర రంగాల్లో విశిష్టసేవలు అందించి, ప్రఖ్యాతిగాంచిన వారిని ఈ సెనెట్‌లో సభ్యులుగా నియమిస్తారు. ఎప్పటికప్పుడు విద్యారంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకుని డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఈ సెనెట్‌లోని సభ్యులు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. అయితే 2013లో నియమితులైన సెనెట్ సభ్యుల్లో కొందరు తమ ఉద్యోగాల నుంచి పదవీ విరమణ పొందడం, మరికొందరు విదేశాలకు వెళ్లిపోవడం వంటి ఘటనలు కూడా జరిగాయి. 2023లో అప్పటి వీసీ జ్ఞానమణి అకడమిక్ సెనెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఆ తర్వాత రెండేళ్లుగా ఈ సమావేశం జరగనేలేదు. బుధవారం జరిగే సమావేశానికి ఎంతమంది సభ్యులు హాజరవుతారనే అంశంపైనా స్పష్టత లేదు. ఈ సమావేశం జరిగితే గతంలో యూనివర్సిటీలో రద్దు చేసిన ఎం-ఫార్మసీ కోర్సును తిరిగి పునరుద్ధరించే అంశంతోపాటు వ్యాయామ విద్యకు సంబంధించిన కోర్సును ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే పునాదుల దశలో ఆగిపోయిన ఇంజనీరింగ్ కళాశాల, బాలుర వసతి గృహానికి సంబంధించిన భవనాల నిర్మాణం మళ్లీ ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం కూడా జరుగుతోంది.

వేదమయి..

(5వ పేజీ తరువాయి)

సాయంత్రం నాలుగు గంటల సమయానికి 56,545 మంది దర్శించుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. 32 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ ఆ తర్వాత భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. తొలిరోజు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను రికార్డుస్థాయిలో 90 వేల మంది దర్శించుకొన్నారు. కాగా, కనకదుర్గమ్మ బుధవారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

రసాయనిక ఎరువులు వినియోగించొద్దు

● మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వరి పైరుపై పిచికారి చేయవద్దని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ తెలిపారు. మంగళవారం కల్వపూడి అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను ఆఖరి కోటాగా 25 కేజీల పొటాష్, 15 నుంచి 20 కేజీల యూరియా కలుపుకుని వరి పైరుపై చల్లుకోవాలన్నారు. ఎక్కువగా యూరియా చల్లవద్దని తెలిపారు. ఎక్కువగా యూరియా చల్లితే పొలం బాగా నల్లబడి వరి పైరుకు తెగుళ్ల వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని పొలాలు చిరుపొట్ట దశలో ఉన్నందున వర్షాలు వస్తున్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతీ రోజు రైతులు పొలాలకు వెళ్లి వరి పొలాలు పరిశీలించాలని తెలిపారు. ఏమైనా ముడత తెగులు, చీడపీడలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా మెలగాలి

పామర్రు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఆన్‌లైన్ ఆర్థిక నేరాల నివారణ పద్ధతుల పట్ల కళాశాల విద్యార్థులు పూర్తి అవగాహనతో మెలగాలని పామర్రు సీఐ వి.సుభాకర్ అన్నారు. స్థానిక కేటీఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాల నియంత్రణ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఏటీఎం పిన్ కోడ్‌లను వినియోగదారులు ఎప్పటికప్పుడు మార్పు చేస్తూ ఉండాలన్నారు.

వీరాంజనేయస్వామి దేవాలయంలో పూజలు

పామర్రు : ఉండ్రపూడి- పోలవరం అడ్డరోడ్డు వద్దగల వీరాంజనేయస్వామి ఆలయానికి మంగళవారం స్వామివారిని దర్శించుకునేందుకు సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజాధికాలు జరిపించుకున్నారు. మహిళలు పాల పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఈవో ప్రసాద్‌రావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం రామచార్యులు, బొతనబొట్ల సుబ్బారావు, ఫణి,శర్మ లు పూజాదికాలు జరిపి తీర్థప్రసాదాలు అందజేసారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

నందివాడ : కొద్దిపాటి వర్షానికి విద్యుత్‌సరఫరా ఆగిపోవటంతో పాటు ఎక్కడో తెలియక రాత్రీ, పగలు అనే తేడా లేక వైర్లు వెతకలేక విద్యుత్ శాఖ సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నట్టు విద్యుత్ శాఖ ఏడీ బాపిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఎక్కడికక్కడ అనుకూలంగా ఉన్న చోట్ల విద్యుత్‌ను ఆపే విధంగా ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో చేపల చెరువులు ఎక్కువగా ఉండటం వల్ల కొద్దిపాటి వర్షానికి కరెంటుపోవటంతో ఎక్కడ సమస్య అనేది తెలుసుకోలేకపోవటంతో ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం



మోపిదేవి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన చింతపల్లి రామగోపాల్‌రావు రూ.50,116 విరాళంగా అందజేశారు. కుటుంబసమేతంగా మంగళవారం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే మండలి



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఏడుగురు లబ్ధిదారులకు రూ.12,01,377 సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యాన్ని సకాలంలో అందించటమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. పేదలు తమ వైద్య అవసరాల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం చేసిన దరఖాస్తులను సాధ్యమైనంత వేగంగా ఆమోదిస్తూ సీఎం చంద్రబాబు ఔదార్యం చూపుతున్నారని తెలిపారు.



స్వచ్ఛ కార్యకర్తలతో స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్

3,600 రోజులకు స్వచ్ఛ చల్లపల్లి

చల్లపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా నిర్విరామంగా సాగుతున్న స్వచ్ఛ చల్లపల్లి సేవాయజ్ఞం మంగళవారం 3,600 రోజులకు చేరుకుంది. ప్రముఖ వైద్యులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు గ్రామ పరిశుభ్రత, స్వచ్ఛత కోసం ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలందిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై కొత్తూరు జంక్షన్ సమీపంలోని బస్‌షెల్టర్ పరిసరాల్లో స్వచ్ఛ సేవలు చేశారు. రోడ్డు మార్జిన్‌లు, దిగువ భాగంలో నాటిన మొక్కల చుట్టూ పెరిగిన కలుపును, పిచ్చిమొక్కలను తొలగించి, మొక్కలకు రక్షణగా కంపకట్టారు. రహదారి మార్జిన్‌లు శుభ్రంచేసి చెత్త, తుక్కు తరలించారు. ఆరున్నర తర్వాత స్వచ్ఛసేవలు నిలిపివేసి స్వచ్ఛ చల్లపల్లి నినాదాలతో నిష్క్రమించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, సజ్జా ప్రసాద్, మాలెంపాటి అంజియ్య, పైడిపాముల రాజేంద్ర, కోడూరు వెంకటేశ్వరరావు, పల్నాటి భాస్కర్, కస్తూరి విజయ్ పాల్గొన్నారు.

బధిరుల కోసం వ్యాఖ్యాతల ఏర్పాటుకు కృషి



బధిరులకు టచ్ ఫోన్లు, వినికిడి యంత్రాలు అందజేస్తున్న డైరెక్టర్ బి.రవిప్రకాశరెడ్డి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో బధిరుల కోసం వ్యాఖ్యాతను నియమించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ బి. రవిప్రకాశరెడ్డి అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి సమావేశపు హాలులో మంగళవారం బధిరుల దినోత్సవం జరిగింది. డైరెక్టర్ బి. రవిప్రకాశరెడ్డి తొమ్మిది మంది బధిరులకు టచ్ ఫోన్లు, 10 మంది వృద్ధులకు వినికిడి యంత్రాలు అందజేశారు. దాదాపు 200 మంది బధిరులు హాజరయ్యారు. రవిప్రకాశరెడ్డి మాట్లాడుతూ, బధిరులకు టచ్‌ఫోన్ మంజూరుకు ఇంటర్ అర్హత నిబంధన తొలగించాలని బధిరలు వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. దివ్యాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వాడ్రేవు కామరాజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. చంద్రశేఖర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగుల సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.



కళాశాలలో కలుసుకున్న నోబుల్ కళాశాల 1983 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు

నోబుల్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సంగమం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నోబుల్ కళాశాలలో 1983లో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తరువాత మంగళవారం కలిశారు. కుశల ప్రశ్నలు వేసుకుని మధురస్మృతులను నెమరువేసుకున్నారు. ప్రస్తుత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జె. ఎర్నెస్ట్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివారు. ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్ అయినందుకు పూర్వ విద్యార్థులందరూ ఘనంగా సత్కరించారు. వేము కోటేశ్వరరావు, జయరాజు, వేణుబాబు, జాషువా, వైజయంతి, స్వరూప, కోటేశ్వరరావు, బెంజిమెన్, అలెగ్జాండర్ తదితరులు మాట్లాడారు. జ్ఞాపికలు ఇచ్చి తమ చిన్ననాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మల్కాపట్నంలో జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికను తల్లి మందలించటంతో సోమవారం రాత్రి బలన్మరణానికి పాల్పడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



భాస్కరపురం త్రిశక్తిపీఠంలో.. పెడన పైడమ్మ.. గూడూరులో.. చల్లపల్లి శ్రీకన్యకాపరమేశ్వరీ అవనిగడ్డ లంకమ్మ.. కోడూరులో.. పెదకళ్లేపల్లిలో...

గాయత్రీదేవిగా జగజ్జనని

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు మంగళవారం ప్రముఖ దేవాలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, సర్కిల్‌పేట మల్లేశ్వర స్వామి, బచ్చుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, ఈడేపల్లి శక్తిగుడి, భాస్కరపురం త్రిశక్తిపీఠం, కన్యకా పరమేశ్వరీ, ఈడేపల్లి జోడుగుళ్ల దేవస్థానాలలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు, కన్యకా పరమేశ్వరీ దేవాలయం, త్రిశక్తిపీఠంలో కూచిపూడి కళాకారులు నాటాచార్య ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారులు సమ్మెట ఆంజనేయ స్వామి, గుమ్మడి కృష్ణారావు, మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, సామా వెంకటలక్ష్మీకాంతారావు, భైసాని హయగ్రీవరావు, ఉడత్తు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **పెడన** : పెడన పైడమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గూడూరు శివదత్త ఆధ్వర్యంలో ముచ్చు నాగేంద్ర, మౌనిక దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దాతలు దేవస్థానం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో గూడవల్లి వెంకట కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయు నందరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీదేవి గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. సువాసినులు 108 సార్లు లలిత పారాయణ చేశారు. లక్కీడీప్ డ్రా తీసి విజేతలైన మహిళలకు చీరెలు, పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షించారు. **పెడన రూరల్** : చెన్నూరు గంగా పార్వతి సమేత నారద లింగేశ్వర స్వామి, ఉరివి పార్వతీ సమేత సోమేశ్వర స్వామి, చోడవరం అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, ఉప్పలకలవగుంట, బల్లిపర్రు, నడుపూరు, నందిగం, లంకలకలవగుంట ఆలయాలలో అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు లలితా సహస్ర నామ పారాయణ చేశారు. **గూడూరు** : గూడూరు గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్త లు పాల్గొన్నారు. ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. **చల్లపల్లి** : శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చల్లపల్లిలోని అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరీ, నడకుదురు పృథ్వీశ్వరక్షేత్రంలో బాలాత్రిపురసుందరీదేవి, లక్ష్మీపురం దుర్గా పార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీ నాంచారమ్మ ఆలయం, రామానగరం క్లబ్‌రోడ్‌లోని ఉత్సవ పందిరితోపాటు పలు గ్రామాల్లోని ఆలయాలు, ఉత్సవపందిళ్లలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. **ఘంటసాల** : శ్రీకాకుళం ముదిరాజ్ రామాలయం వద్ద కోడి చిన్నవెంకట స్వామి - చిన్నకృష్ణవేణి దంపతులుతో వాడపల్లి సత్య శ్రీరామ గణేష్ విశేష పూజలు చేయించారు. **అవనిగడ్డ** : లంకమ్మ అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) ఏర్పాట్లు పర్యవేక్షించారు. గీతామందిరంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. చింతలపూడి సిస్టర్స్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి విశేష కుంకుమ పూజలు జరిపారు. దీవి నరసింహమూర్తి అమ్మవారికి అర్చనలు జరిపారు. ధర్మకర్త శ్రీహరిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలోని కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరిదేవిగా, వేకనూరులో అంకాలమ్మ గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. మండలి వెంకట కృష్ణారావు, మాదివాడ శ్రీనివాస పెరుమాళ్ల పర్యవేక్షించారు. **మోపిదేవి** : పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, పుష్పార్చనలు నిర్వహించారు. గాయత్రీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. **కోడూరు** : విశ్వనాథపల్లి, మందపాకల, కోడూరు, నరసింహపురం దేవాలయాలలో గాయత్రీదేవిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీకాకుళంలోని ముదిరాజ్ రామాలయం వద్ద..



బందరు కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో నృత్య ప్రదర్శన

నాగాయలంక : దుర్గాగణపేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. ధర్మకర్త మండలి శ్రీరామ చంద్రమూర్తి, ఈవో సిహెచ్.సుధాకర్‌రావు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా, పార్వతీ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిట్టా సాంబశివరావు పర్యవేక్షించారు. కనకదుర్గమ్మ ఆలయంలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ప్రజల జీవనోపాధి అవకాశాలు పెరగాలి : కలెక్టర్

మచిలీపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల జీవనోపాధి అవకాశాలు మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ, పరిశ్రమలు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, సంక్షేమ, తదితర శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. జీవనోపాధిని పెంచడానికి డ్వాక్రా సంఘాల సభ్యులకు విరివిగా బ్యాంకుల రుణాలు అందేలా చూడాలన్నారు. పొలాల మధ్య 10 సెంట్ల భూమిలో కొర్రమీను చేపల సాగు చేపట్టేందుకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని. ఆసక్తిగల లబ్ధిదారులను గుర్తించి, రుణాలు అందేలా చూడాలన్నారు. తీరప్రాంతంలో పీతలసాగు, సముద్రపు నాచు పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఏపీ ఎంబీసీ పీడీ రత్నాచార్యులు, పరిశ్రమలశాఖ మేనేజర్ ఆర్ వెంకట్రావ్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, ఉద్యానశాఖ జేడీ జ్యోతి, ఎస్సీకార్పొరేషన్ జేడీ షేక్ షాహిద్‌బాబు, బీసీ కార్పోరేషన్ ఈడీ రాజేంద్రబాబు, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దేసు నీరజ, సభ్యులు, మాట్లాడుతున్న కొనకళ్ల బుల్లయ్య

రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్‌పర్సన్‌గా నీరజ

• ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలి : బుల్లయ్య, కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు ధర్మకర్తల మండలి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య అన్నారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్‌పర్సన్‌గా దేసు నీరజ, సభ్యులుగా ప్రముఖ జ్యోతిష్య పండితుడు నిమ్మగడ్డ శ్రీధర్, పామర్తి ఝాన్సీలక్ష్మి, ముత్యాలపల్లి నాగలక్ష్మి, వానపాముల వేంకటేశ్వర ప్రసాద్, బోసు నాగమణి, కోట శ్రీదుర్గ, సాతులూరి రాజామణి, కొడాలి అంజయ్య, సుంకర లక్ష్మీరాజేశ్వరి, ఘంటసాల భాస్కరశర్మ, పొట్లూరి నరేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మకర్తల మండలితో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొనకళ్ల బుల్లయ్య మాట్లాడుతూ, కొనకళ నారాయణరావు ఎంపీగా దేవాలయం రోడ్డుకు నిధులు మంజూరు చేశారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ మాట్లాడుతూ, ధర్మకర్తల మండలిలో ఎక్కువ మంది మహిళలుండటం అభినందనీయమన్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులకు సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్టేనన్నారు. దేవస్థానం మాజీ చైర్మన్ దేసు సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ, భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, పి.శ్రీరామ్, ఐ.దిలీప్, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి సభ్యులను కొనకళ్ల బుల్లయ్య, ఈవో సమ్మెట ఆంజనేయ స్వామి ఘనంగా సత్కరించారు.

పాండురంగస్వామి ఆలయంలో బీజేపీ నేతల స్వచ్ఛ సేవ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయం ఆవరణలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తిగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తాతినేని శ్రీరామ్ అన్నారు. కూనపరెడ్డి శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, తోట రంగనాథ్, పుప్పాల రాము, వై.వి.ఆర్. పాండురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, పెదశింగు శ్రీనివాస్, గంటా సతీష్, శీలం వెంకటస్వామినాయుడు, వన్నెంరెడ్డి ప్రసన్నకుమార్, సలాది రామకృష్ణ, హరిరామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

ఘంటసాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిట్టూర్పు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వస్థ్ నారీ - సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాకుళం పీహెచ్‌సీ డాక్టర్ సాయిశరణ్య, జె.అనిత 295 మంది మహిళలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, కొడాలి పీఏసీఎస్ చైర్ పర్సన్ గుత్తికొండ వరప్రసాద్‌లు ప్రారంభించారు. ఉపసర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయీమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిన ఆకులమన్నారులో వైద్యపరీక్షలు

గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆకులమన్నాడు గ్రామ పంచాయతీ పరిధిలోని చిన ఆకులమన్నాడులో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం డాక్టర్ కె. మీనాదేవి, సర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యు లు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు వివరించారు. ఎంపీహెచ్ ఈవో వీరయ్య, హెచ్‌వి సరళ, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భాస్కరరావు నేత్రాల దానం

నాగాయలంక : నాగాయలంక ఒకటో వార్డులో తలశిల భాస్కరరావు (78) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు తలశిల గోపి, కుమార్తె ఉప్పల సరోజ సహకారంతో మృతుడి నేత్రాలను దానం చేశారు. విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యు లు మహేష్, సిబ్బంది నేత్రాలను సేకరించారని సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు.



జీవామృతం తయారీపై అవగాహన

ఘంటసాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి పర్యవేక్షణలో జీవామృతం తయారీ విధానంపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవామృతాన్ని వరి, మినుము, ఇతర కూరగాయల పంటలకు వినియోగించుకోవచ్చునని తెలిపారు. మొక్కలకు మంచి పోషకాలు అందించటంతోపాటు భూమి సారం కూడా పెరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు రేవతి, రైతులు పాల్గొన్నారు.

పీ-4 అమలుపై శిక్షణ

పెడన రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ-4 అమలుకు చేపట్టాల్సిన పథకం అంశాలను వివరిస్తూ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో అరుణకుమారి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి హరనాథ్ ముఖ్యతిథిగా పాల్గొన్నారు. గుర్తించిన బంగారు కుటుంబాలలో ఏడాదిలోగా పదిశాతం మందికి తెల్లరేషన్‌కార్డులతో పనిలేకుండా కుటుంబాలను తీర్చిదిద్దాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, కార్యదర్శులు పర్హతుల్లా, అనురాధ, జానకి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల బంద్

పెడన, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఫీజు బకాయిలు విడుదల చేయాలన్న డిమాండ్‌తో పట్టణంలోని విజయానంద డిగ్రీ కళాశాలను మంగళవారం మూసి వేశారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని కళాశాల యాజమాన్యం తెలిపింది.

స్నానానికి వెళ్లి కాల్వలో బాలుడు గల్లంతు



గల్లంతైన జీవన్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్నానానికి వెళ్లిన బాలుడు క్వాలలో గల్లంతయిన సంఘటన మంగళవారం గూడూరులో జరిగింది. గ్రామానికి చెందిన వెలిపూడి జీవన్‌కుమార్ (12) గూడూరు హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి పఠాన్‌పేట జొన్నలరేవు (రామరాజుపాలెం కాలువ) వద్ద మధ్యాహ్నం స్నానానికి వెళ్లారు. మిగతా వారందరూ ఇళ్లకు వచ్చేశారు. జీవన్‌కుమార్ సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి విజయ్, తల్లి సావిత్రి స్నేహితుల ఇళ్లకు వెళ్లి వాకబు చేశారు. కాలువకు స్నానానికి వెళ్లిన సంగతి చెప్పడంతో తల్లిదండ్రులు కాలువ వద్దకు వెళ్లి పరిశీలించగా జీవన్ వేసుకున్న టీ షర్టు, చెప్పులు అక్కడ కనిపించాయి. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్సై శామ్యూల్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగువకు వరద

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 14.5 అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. మరో వారం రోజులపాటు కృష్ణానదికి వరద కొనసాగుతుందని, అయినా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఇరిగేషన్ డీఈఈ గణపతి తెలిపారు. **నాగాయలంక** : నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు భారీగా వరద నీరు చేరింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

బస్సులో దొరికిన పర్సు పోలీస్ స్టేషన్‌లో అప్పగింత

పామర్రు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గుడివాడ- అవనిగడ్డకు తిరిగే ఆర్టీసీ బస్సు లో ఓ ప్రయాణీకుడు జార విడుచుకున్న పర్సు , విధుల్లో ఉన్న మహిళ కండక్టర్‌కు దొరికింది. ఆ మహిళా కండక్టర్ గుమ్మడి స్వరాజ్యం ప్రయాణికుడి ఆచూకీ కోసం ప్రయత్నించి, ఆ పర్సును మంగళవారం పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజేంద్ర ప్రసాద్‌కు అప్పగించింది. ఆపర్సులో రూ.2500 నగదు, బ్యాంకు ఏటీఎం కార్డుతోపాటుగా డ్రైవింగ్ లైసెన్సు ఉన్నాయి. పర్సు పోగొట్టుకున్న వ్యక్తి పామర్రుకు చెందిన షేక్ బాజీబాబుగా గుర్తించి, పర్సును తీసుకెళ్లాలని ఎస్సై సూచించారు. కండక్టర్ నిజాయితిని పలువురు ప్రశంసించారు.



ఎస్సై రాజేంద్రప్రసాద్‌కు పర్సును అప్పగిస్తున్న కండక్టర్ స్వరాజ్యం



గుడివాడలో..



కూచిపూడిలో..



పామర్రులో..



పెదపారుపూడిలో..



తోట్లవల్లూరులో..

గాయత్రీదేవికి భక్త నీరాజనం

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం పలు దేవాలయాల్లోని అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శన మిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.అలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాల రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ బోసు, సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు సంతానలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ సతీష్, సభ్యులు, పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అమ్మవారు ధాన్యలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మంగళగౌరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ హరిబాబు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీబిల్వేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ బుడమా రాజు, సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భా గంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారి గాయత్రిదేవిగా అలంకరించారు. ఆలయ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆలయ ట్రస్టీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం ఉదయం నుంచే వందలాది మంది భక్తులు గాయత్రీదేవిని దర్శించుకున్నారు. చౌటపల్లి, మోటూరు, దొండపాడు తదితర గ్రామాల్లో చలువ పందిళ్ల నందు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కూచిపూడి: కూచిపూడి, చినముత్తేవి, మొవ్వ, పెదపూడి, మొవ్వపాలెం, గూడపాడు, నిడుమోలు, అయ్యంకి తదితర గ్రామాల్లో విశేష పూజలు, కుంకుమార్చన, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెదపారుపూడి : పెదపారుపూడిలో బీసీ కాలనీలోని అమ్మవారి దేవాలయంలో రెండవ రోజు అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదపారుపూడిలో గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. నీలపాల నాగరాజు - నాగలక్ష్మీ దంపతులు, కమిటీ సభ్యులు మసిముక్కు తిరుమలరావు, మసిముక్కు బాబా, అంగిరేకుల రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



గుడ్లవల్లేరులో..

పామర్రు: గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మంగళగౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి అమ్మవారి ఆలయంలో గాయత్రీదేవి అలంకారంలో, శ్రీవాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని కురుమద్దాలి, పెదమద్దాలి ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు శ్రీమద్‌భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రెండవరోజైన మంగళవారం కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గుడ్లవల్లేరు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం పూజాకార్యక్రమాల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భజనా కార్యక్రమాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు, ఆలయ ధర్మకర్తలు తూము రాజ్యలక్ష్మి, ఆలయ ఈవో ఆకుల కొండలరావు, పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

గుడివాడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు, పొలాల్లోని మట్టి నమూనాలను త్వరగా పరీక్షిస్తున్నట్లు ఏవోలు గుమ్మడి సురేష్, జి.సాయిసింధులు అన్నారు. మంగళవారం గుడివాడ మార్కెట్ కేంద్రంలోని మట్టి నమూనా కేంద్రంలో నమూనాను పరిశీలించారు. గుడివాడ భూ సార పరీక్షా కేంద్రానికి 23 మండలాల మట్టి నమూనాలు వచ్చాయని తెలిపారు. తోట్లవల్లూరు, పామర్రు, గుడివాడ, పెదపారుపూడి, పెనమలూరు మండలాల రైతుల పొలాల్లోని మట్టిని పూర్తిగా పరీక్షించి రికార్డులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఘంటసాల, గుడ్లవల్లేరు మండలాలకు సంబంధించిన రైతుల మట్టినమూనాలను పరీక్షిస్తున్నామని తెలిపారు. మనిషి ఆరోగ్యం డాక్టర్ పరీక్షించినట్లే పొలంలోని మట్టిని పరీక్షించటం వల్ల పొలంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా రైతులు సరి చేసుకోవచ్చునని తెలిపారు. భాస్వరం, పొటాష్ తక్కువగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా సరి చేసుకోవచ్చునని తెలిపారు. రైతులందరూ వారి పొలాల్లోని మట్టి నమూనాలు పరీక్షించుకోవాలని తెలిపారు. ఫ్రాన్సిస్, కె.సురేష్, భవాని, సంధ్య పాల్గొన్నారు.



మట్టి నమూనాను పరిశీలిస్తున్న ఏవోలు సురేష్, సాయిసింధు

రహదారి నిర్మాణ పనులు పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రామలింగేశ్వరరావు

కూచిపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కేటాయించిన రూ.13 లక్షలతో పెదముత్తేవి లో ప్రారంభించిన సీసీ రహదారి నిర్మాణ పనులను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు పరిశీలించారు. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25 లక్షలతో గ్రామం నుంచి ఐనంపూడి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన వరకు కొంతమేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఎంపీ నిధులతో మిగిలిన రహదారి నిర్మాణ పనులు చేపట్టినట్టు ఆయన తెలిపారు. నిధులు కేటాయించిన బాలశౌరికి రామలింగేశ్వరరావుతోపాటు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

గుడివాడ టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చెరుకూరి

గుడివాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : గుడివాడ టూవీలర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా చెరుకూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక కిన్నెర కాంప్లెక్స్‌లో ది గుడివాడ టూవీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా అన్సారీ, కార్యదర్శిగా వి.సింహాచలం,కోశాధికారిగా పినపాల మధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కొండపల్లి మధుబాబు, రవి, శ్రీను పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కూచిపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోసూరులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.ఎస్.విశ్వనాథ్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలియజేశారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని ఎస్సై తెలిపారు.